# శుభోదయం
ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!
WWW.SUBHODAYAMDAILY.COM

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 01, సంచిక : 216, పేజిలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు ( 9491020055) శనివారం - 19 - అక్టోబర్ - 2024


## బెంగళూరు టెస్టు.. కివీస్ 402 ఆలౌట్.. నిలకడగా ఆడుతున్న భారత్!




చిన్నస్వామి స్టేడియం వేదికగా న్యూజిలాండ్, భారత్ తొలి టెస్టు

శతకం (134)తో రాణించిన రచిన్ రవీంద్ర

కుల్దీప్ యాదవ్, రవీంద్ర జడేజా చెరో మూడు వికెట్లు

తొలి ఇన్నింగ్స్‌లో 46 పరుగులకే ఆలౌట్ అయిన టీమిండియా

కివీస్‌కు తొలి ఇన్నింగ్స్‌లో 356 పరుగుల భారీ ఆధిక్యం

## బాల్య వివాహాల కట్టడికి సుప్రీంకోర్టు మార్గదర్శకాలు




బాల్య వివాహాల నిరోధక చట్టం అమలుకు వ్యక్తిగత చట్టాలు అడ్డంకి కారాదన్న న్యాయస్థానం

సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, మనోజ్ మిశ్రా, జేబీ పార్థీవాలాతో కూడిన ధర్మాసనం కీలక ఆదేశాలు

బాల్యంలో పెళ్లి చేస్తే, జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకునే స్వేచ్ఛను హరించినట్లేనన్న కోర్టు

## కేజ్రీవాల్ నిర్ణయం కలిసొచ్చేదెవరికి..!!




ఢిల్లీ: మహారాష్ట్ర.. జార్ఖండ్ లో ఎన్నికల సమరం పతాక స్థాయికి చేరింది. రెండు రాష్ట్రాల్లోనూ కూటమి లే ప్రధానంగా పోటీలో ఉన్నాయి. హర్యానా, జమ్మూ కాశ్మీర్ ఫలితాల తరువాత ఈ రెండు రాష్ట్రాల ఎన్నికల పైన జాతీయ స్థాయిలో ఆసక్తి కనిపిస్తోంది. అయితే, ఈ రెండు రాష్ట్రాల్లో పార్టీ పైన ఆప్ తీసుకున్న నిర్ణయం సంచలనంగా మారుతోంది.

## మూసీ నీళ్లతో స్నానం చేసేలా... తాగేలా బాగు చేస్తాం: మంత్రి సీతక్క



స్వయం సహాయ సంఘాల సభ్యులకు రూ.2 లక్షలు ఇస్తున్నామన్న సీతక్క

172 స్వయం సహాయ సంఘాల సభ్యులకు రూ.3.44 కోట్ల రుణాలు ఇస్తున్నట్లు వెల్లడి

ఇందులో రూ.1.4 లక్షలు ఉచితంగా ఇస్తున్నామన్న మంత్రి

## ఎన్నికల వేళ.. రాహుల్ నయా స్ట్రాటజీ



2లో

- దేశంలో మరో రెండు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల నగారా మోగింది
- ఫలితంగా ఈ రెండు చోట్ల రాజకీయ వేడి రాజుకుంది
- ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన మేజిక్ ఫిగర్ 44

# ఇలాంటి పరిస్థితులను గతంలో ఎప్పుడూ చూడలేదు: సీఎం చంద్రబాబు

రాష్ట్రంలో ఏ అరాచకం చూసినా, దాని వెనుక ఏదో ఒక గంజాయి బ్యాచ్



వివరాలు 2లో..

- మంగళగిరిలో నేడు టీడీపీ ప్రజాప్రతినిధుల సమావేశం
- టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలకు చంద్రబాబు దిశానిర్దేశం
- పార్టీలో ఉన్న ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో ఉండాలని స్పష్టీకరణ
- కార్యకర్త తప్పు చేసినా ఆ ప్రభావం సీఎంపైనా, పార్టీపైనా పడుతుందని వెల్లడి

అమరావతి : తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలతో పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు సమావేశం నిర్వహించారు. మంగళగిరి లోని మిగతా..2లో

# ఒక్క మూడు నెలలు మీరక్కడ ఉండండి: రేవంత్ బిగ్ ఆఫర్



అయితే.. మీరు ఏదైతే విమర్శలు చేస్తున్నారో.. అక్కడ మీరు ఒక్క మూడు నెలలు ఉండండి. ఆ తర్వాత కూడా ఇప్పుడు చెబుతున్నట్టే మీరు చెబితే.. నా నిర్ణయాన్ని మార్చుకుంటా” అని రేవంత్ రెడ్డి సంచలన ఆఫర్ ఇచ్చారు.

- మూసీ నది ప్రక్షాళనపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలకు ఆయన ఘాటుగా స్పందించారు
- ముగ్గురూ మూడు మాసాలు మూసీ పరివాహక ప్రాంతంలో ఉండా
- ఈ విషయంలో బీజేపీ, బీఆర్ ఎస్, ఎంఐఎం నేతలు స్పందించాలని కోరారు
- కేసీఆర్ - కసబ్ రేవంత్ రెడ్డి తన మాటల్లో కరడుగట్టిన ఉగ్రవాది కసబ్ ప్రస్తావన తీసుకువచ్చారు

హైదరాబాద్ : మీరునన్ను విమర్శిస్తున్నారు. మంచిదే. ఇది మీకు ఒక మంచి అవకాశంగా కూడా మారింది. అది కూడా ఓకే. అయితే.. మీరు ఏదైతే విమర్శలు చేస్తున్నారో.. అక్కడ మీరు ఒక్క మూడు నెలలు ఉండండి. ఆ తర్వాత కూడా ఇప్పుడు చెబుతున్నట్టే మీరు చెబితే.. మిగతా..2లో

## ‘సాక్షి’పై పరువునష్టం కేసులో వైజాగ్ కోర్టుకు మంత్రి నారా లోకేశ్



2లో

‘చినబాబు తిండికి 25 లక్షలండి’ పేరుతో 2019లో సాక్షి కథనం

అసత్య కథనాలతో కథనం ప్రచురించారని రూ. 75 కోట్లకు పరువునష్టం దావా

నేడు కోర్టులో వాదనలు వినిపించనున్న లోకేశ్ న్యాయవాదులు

## ఏపీలో ఇక రూ.99ల క్వార్టర్ బాటిల్ కూడా లభ్యం




ప్రైవేటు మద్యం షాపుల్లో అందుబాటులోకి వచ్చిన వివిధ రకాల బ్రాండ్ల మద్యం

సోమవారం నాటికి రూ.99ల క్వార్టర్ మద్యం సీసాలు 20వేల కేసులకు చేరుకోనుందని చెప్పిన ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారి

ఈ నెలలో కోటి ఇరవై లక్షల క్వార్టర్ సీసాల మద్యం సిద్దం అవుతున్నట్లు వెల్లడి

## వాంగ్మూలం తీసుకుంటామని చెప్పినా మళ్లీ సమయం ఎలా కోరుతారు?: కేటీఆర్‌కు కోర్టు ప్రశ్న



- కొండా సురేఖపై పరువు నష్టం కేసులో ఈ రోజు వాంగ్మూలం నమోదు చేస్తామన్న కోర్టు
- అనివార్య కారణాల వల్ల కేటీఆర్ హాజరు కాలేకపోయారన్న న్యాయవాది
- బుధవారం స్టేట్‌మెంట్ రికార్డ్ చేస్తామని స్పష్టం చేసిన కోర్టు

# న్యాయం గెలిచిందంట... మరి వీటి సంగతేంటి?

2లో

- చంద్రబాబుపై జగన్ విమర్శనాస్త్రాలు
- తాడేపల్లిలో జగన్ మీడియా సమావేశం
- ఇటీవల స్కిల్ కేసులో ఆస్తులు అటాచ్ చేసిన ఈడీ
- చంద్రబాబుకు ఈడీ క్లీన్ చిట్ ఇచ్చిందంటూ టీడీపీ ట్వీట్
- తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన జగన్
- చంద్రబాబుకు, టీడీపీకి, కొన్ని మీడియా సంస్థలకు ప్రశ్నల వర్షం



అమ రావతి : వైసీపీ అధినేత జగన్ నేడు తాడేపల్లిలో మీడియా సమావేశం నిర్వహించారు. సీఎం చంద్రబాబు పైనా, తెలుగుదేశం పార్టీ పైనా, కొన్ని మీడియా సంస్థల పైనా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇటీవల మిగతా..2లో

## టైమ్... డేట్ మీరు నిర్ణయిస్తారా? నన్ను నిర్ణయించమంటారా? : రేవంత్ రెడ్డికి హరీశ్ రావు సవాల్




ఉదయం తొమ్మిది గంటలకు మూసీ పరీవాహక ప్రాంతం వద్దకు వెళ్దామన్న హరీశ్ రావు

బిజీ అయితే టైమ్... డేట్ చెప్పాలని సవాల్

అబద్ధమే ఆశ్చర్యపడేలా రేవంత్ రెడ్డి నిన్నటి ప్రెస్ మీట్ ఉందని ఎద్దేవా

హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు సవాల్ విసిరారు. రేపు ఉదయం తొమ్మిది గంటలకు గన్‌మన్‌లు లేకుండా మిగతా..2లో

## బెంగళూరు టెస్టు.. కివీస్ 402 ఆలౌట్..

# నిలకడగా ఆడుతున్న భారత్!

ఢిల్లీ : : బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా జరుగుతున్న తొలి టెస్టులో న్యూజిలాండ్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 402 పరుగులకే ఆలౌట్ అయింది. రచిన్ రవీంద్ర శతకం (134) బాదగా.. కాన్వే (91), టిమ్ సౌథీ (65) అర్ధ శతకాలతో రాణించారు. భారత బౌలర్లలో కుల్దీప్ యాదవ్, రవీంద్ర జడేజా చెరో మూడు వికెట్లు పడగొట్టగా... మహ్మద్ సిరాజ్ 2, అశ్విన్, బుమ్రా చెరో వికెట్ తీశారు. అంతకుముందు భారత్ తన తొలి ఇన్నింగ్స్‌లో 46 పరుగులకే ఆలౌట్ అయిన విషయం తెలిసిందే. దీంతో కివీస్ కు తొలి ఇన్నింగ్స్‌లో 356 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన టీమిండియా నిలకడగా ఆడుతోంది. 18 ఓవర్లు ముగిసేసరికి భారత జట్టు ఒక వికెట్ కోల్పోయి 72 పరుగులు చేసింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ 35 రన్స్ చేసి ఔటయ్యాడు. రోహిత్ శర్మ (36), విరాట్ కోహ్లీ (0) క్రీజులో ఉన్నారు.

# బాల్య వివాహాల కట్టడికి సుప్రీంకోర్టు మార్గదర్శకాలు

అమరావతి : బాల్య వివాహాలపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. బాల్య వివాహాల నిరోధక చట్టం అమలుకు వ్యక్తిగత చట్టాలు అడ్డంకి కారాదని న్యాయస్థానం అభిప్రాయపడింది. దేశంలో బాల్య వివాహాల నిరోధక చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ జేబీ పార్దీవాలాతో కూడిన ధర్మాసనం శుక్రవారం మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ సందర్భంగా బాల్యంలో పెళ్లి చేస్తే, జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకునే స్వేచ్ఛను హరించినట్లే అవుతుందని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. బాల్య వివాహాలు, మైనర్ల రక్షణపై అధికారులు దృష్టి సారించాలని సూచించింది. నేరస్థులకు జరిమానా విధించాలని తెలిపింది. వ్యక్తిగత చట్టాలతో బాల్య వివాహాల నిరోధక చట్టాన్ని అడ్డుకోవద్దని అభిప్రాయపడింది.

# కేజ్రీవాల్ నిర్ణయం కలిసొచ్చేదెవరికి..!!

మొదటి పేజి తరువాయి

కేజ్రీవాల్ తాజా నిర్ణయం ఈ రెండు రాష్ట్రాల్లో ఎవరికి కలిసి వస్తుందనేది ఇంట్రస్టింగ్ గా మారింది.

కేజ్రీ కీలక నిర్ణయం

ఆమ్ ఆద్మీ పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. మహారాష్ట్ర, ఝార?ండ్ అసెంబ్లీ ఎన్నికలకు దూరంగా ఉండాలనే నిర్ణయానికి వచ్చింది. త్వరలో ఢిల్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పూర్తిగా అక్కడే ఫోకస్ చేయాలని కేజ్రీవాల్ భావిస్తున్నారు. దీని వెనుక అనేక కారణాలు తెర మీదకు వస్తున్నాయి. తాజాగా జరిగిన హర్యానా ఎన్నికల్లో ఆప్ కు అనూహ్య ఫలితాలు ఎదురయ్యాయి. కాంగ్రెస్ తో సీట్ల విషయంలో విభేదించి ఒంటరిగా పోటీ చేసిన ఆప్ ను హర్యానా ప్రజలు ఆదరించలేదు. ఎక్కడా ఒక్క సీటు కూడా దక్కలేదు. అయితే, కాంగ్రెస్ – బీజేపీ మధ్య గెలుపు ను డిసైడ్ చేసిన ఒక్క శాతం కంటే ఎక్కువ ఓట్లు మాత్రం ఆప్ దక్కిచుకుంది.

### ఢిల్లీ పై నజర్

హర్యానా ప్రభావంతో కేజ్రీవాల్ జాగ్రత్త పడ్డారు. తమ కంచుకోట ఢిల్లీ పైనే ప్రధానంగా ఫోకస్ చేయాలని డిసైడ్ అయ్యారు. దీంతో, మహారాష్ట్ర తో పాటుగా జార?ండ్ లోనూ పోటీకి దూరంగా ఉండాలనే నిర్ణయానికి వచ్చారు. తొలుత మహారాష్ట్ర ఎన్నికల్లో పోటీకి ఆప్ ఆసక్తి చూపించింది. కానీ, పార్టీ అధినాయకత్వం మాత్రం రాష్ట్ర యూనిట్ కు పోటీ పైన స్పష్టత ఇవ్వలేదు. దీంతో, అక్కడ ఇండియా కూటమికి మద్దతు ఇచ్చే అవకాశం ఉందనే అంచనాలు మొదలయ్యాయి. అదే విధంగా జార?ండ్ లో ఆప్ కు ఏ మాత్రం పట్టు లేదు. రెండు రాష్ట్రాల్లో బీజేపీ వ్యతిరేక ఓటులో చీలక రాకూడదనే కేజ్రీవాల్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు.

### ప్రాబల్యం లేకనే

2019లో ఆప్ మహారాష్ట్రతో పాటుగా జార?ండ్ లోనూ పోటీ చేసింది. మహారాష్ట్రలో ఆ ఎన్నికల్లో ఆప్ 24 సీట్లకు పోటీ చేయగా.. 23 స్థానాల్లో డిపాజిట్ కోల్పోయింది. అదే విధంగా జార?ండ్ లో ఆప్ ఆ ఎన్నికల్లో 81 స్థానాలకు గాను 26 నియోజకవర్గాల్లో పోటీ చేసింది. అన్ని చోట్ల డిపాజిట్ కోల్పోయింది. దీంతో..ఇప్పుడు రెండు రాష్ట్రాల్లోనూ పోటీ చేయకూడదని డిసైడ్ అయింది. పరోక్షంగా ఇప్పుడు కాంగ్రెస్ కూటమికి సహకరించి.. ఢిల్లీ ఎన్నికల్లోనూ బీజేపీ వ్యతిరేక ఓటు చీలకుండా వారి మద్దతు పొందాలనేది కేజ్రీవాల్ వ్యూహంగా కనిపిస్తోంది. దీంతో.. ఇప్పుడు కేజ్రీవాల్ నిర్ణయం ఎవరికి మేలు చేస్తుంది.. ఢిల్లీలో ఎలాంటి సమీకరణాలకు కారణమవుతుందనేది వేచి చూడాలి.

# మూసీ నీళ్లతో స్నానం చేసేలా... తాగేలా బాగు చేస్తాం: మంత్రి సీతక్క

హైదరాబాద్ : మూసీ నీళ్లతో స్నానం చేసేలా, తాగేలా తాము బాగు చేస్తామని మంత్రి సీతక్క అన్నారు. మూసీ పరీవాహక స్వయం సహాయ సంఘాల సభ్యులకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల చెక్కులను సీతక్క పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మూసీ నది ప్రక్షాళనపై ప్రతిపక్షాల నుంచి వస్తోన్న విమర్శలపై స్పందించారు. మూసీ పరీవాహక స్వయం సహాయ సంఘాల మహిళలకు తాము చేయూతనిస్తున్నామన్నారు. 172 స్వయం సహాయ సంఘాల సభ్యులకు రూ.3.44 కోట్ల రుణాలు ఇస్తున్నట్లు చెప్పారు. మనం జీవించే పరిసరాలు ఎప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. అందుకే మూసీ ప్రక్షాళన చేపట్టామన్నారు. మూసీ నిర్వాసితులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామన్నారు. మూసీ నిర్వాసితుల్లోని ఒక్కో మహిళకు రూ.2 లక్షలు ఇస్తున్నట్లు చెప్పారు. ఇందులో రూ.1.4 లక్షలు ఉచితంగా ఇస్తున్నామని, మిగతా మొత్తం నెలకు రూ.2 వేలు మూడేళ్ల పాటు చెల్లించాలన్నారు.

# ఎన్నికల వేళ.. రాహుల్ నయా స్ట్రాటజీ

ఢిల్లీ :: దేశంలో మరో రెండు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల నగారా మోగింది. మహారాష్ట్ర, జార?ండ్‌లల్లో ఎన్నికల షెడ్యూల్ వెలువడింది. ఫలితంగా ఈ రెండు చోట్లా రాజకీయ వేడి రాజుకుంది. ఎన్నికల్లో గెలుపోటములపై వ్యూహ, ప్రతివ్యూహాలను రచించుకుంటోన్నాయి అన్ని పార్టీలు. మొత్తం 81 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి జార?ండ్‌లో. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన మేజిక్ ఫిగర్ 44. ప్రస్తుతం ఇక్కడ ప్రతిపక్షాల ఉమ్మడి కూటమి ఇండియా అధికారంలో ఉంది. జార?ండ్ ముక్తి మోర్చా-కాంగ్రెస్- వామపక్షాల ప్రభుత్వానికి ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ నాయకత్వాన్ని వహిస్తోన్నారు. నవంబర్ 13, 20 తేదీల్లో రెండు విడతలుగా జార?ండ్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్ సారథ్యంలోని ఎన్డీఏ, ఇండియా కూటమి. అధికారాన్ని నిలబెట్టుకోవడానికి జేఎంఎం-కాంగ్రెస్- వామపక్షాలు, ఈ సారి అధికారంలోకి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి తీరాలని ఎన్డీఏ ప్రయత్నాలు సాగిస్తోన్నాయి. ఈ క్రమంలో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జార?ండ్‌లో పర్యటించనున్నారు. శనివారం రాంచీలో బహిరంగ సభను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. సంవిధాన్ సమ్మాన్ సమ్మేళన్ పేరుతో కాంగ్రెస్ ఈ సభను నిర్వహించనుంది. రాహుల్ గాంధీ సహా జార?ండ్‌కు చెందిన పలువురు నాయకులు ఇందులో పాల్గొననున్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం ఆగస్టులో ఈ కార్యక్రమాన్ని చేపట్టింది కాంగ్రెస్. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దీన్ని నిర్వహించతలపెట్టింది. సంవిధాన్ సమ్మాన్ సమ్మేళన్ పేరుతో దేశవ్యాప్తంగా సభలను నిర్వహిస్తూ వస్తోంది. తొలుత ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీలో ఈ సభను నిర్వహించింది. అనంతరం ప్రయాగ్ రాజ్, కొల్హాపూర్‌లల్లో ఈ సభలు జరిగాయి.ఇప్పుడు తాజాగా రాంచీలో ఈ సభ ఏర్పాటైంది. 2014లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలో కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత తరచూ రాజ్యాంగ ఉల్లంఘనలు చోటు చేసుకుంటోన్నాయంటూ ఆందోళన వ్యక్తం చేస్తూ వస్తోంది కాంగ్రెస్. రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందంటూ చెబుతోంది.

# ఒక్క మూడు నెలలు మీరక్కడ ఉండండి: రేవంత్ బిగ్ ఆఫర్

మొదటి పేజి తరువాయి

నా నిర్ణయాన్ని మార్చుకుంటా" అని రేవంత్ రెడ్డి సంచలన ఆఫర్ ఇచ్చారు. మూసీ నది ప్రక్షాళనపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలకు ఆయన ఘాటుగా స్పందించారు. మూసీ పరివాహక ప్రాంతంలో మూడు మాసాలు ఉండాలని.. అప్పుడు చెప్పాలన్నారు. బీఆర్ ఎస్ మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు, బీజేపీ నాయకుడు ఈటల రాజేందర్‌లను ఉద్దేశించి.. రేవంత్ ఈ వ్యాఖ్యలు చేశారు. నేరుగా వారి పేర్లు చెబుతూ.. ముగ్గురూ మూడు మాసాలు మూసీ పరివాహక ప్రాంతంలో ఉండాలన్నారు. ఎక్కడ ఉంటారో చెబితే.. అక్కడ ఏర్పాట్లు కూడా చేయించేలా అధికారు లను ఆదేశిస్తానన్నారు. అనంతరం.. మీరు మూసీ నది ప్రక్షాళన అవసరం లేదని చెబితే.. అప్పుడు ఆ ప్రతిపాదనను తానే వెనక్కి తీసుకుంటానని కూడా రేవంత్ వ్యాఖ్యానించారు. మూసీ నది ప్రక్షాళనపై ఎలాంటి అనుమానాలు.. ఎవరికి ఉన్నా పరిష్కరించేందుకు తాము సిద్ధంగానే ఉన్నామని చెప్పారు. రాజకీయాలు మానుకోవాలని సీఎం రేవంత్ సూచించారు. సమస్యలపై సూచనలు చేస్తే.. తప్పకుండా వాటిని పరిష్కరించేందుకు ప్రయత్నాలు చేస్తామన్నారు. ఈ విషయంలో బీజేపీ, బీఆర్ ఎస్, ఎంఐఎం నేతలు స్పందించాలని కోరారు. కానీ, ఒక మంచి పనికి అడ్డు తగల వద్దని సూచించారు. కేసీఆర్ – కసబ్ రేవంత్ రెడ్డి తన మాటల్లో కరడుగట్టిన ఉగ్రవాది కసబ్ ప్రస్తావన తీసుకువచ్చారు. కేటీఆర్ కసబ్ మాదిరి గా మారతానంటే తనకేమీ అభ్యంతరం లేదన్నారు. వికారాబాద్‌లో రాడార్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించిందని, ఇది దేశ భద్రతకు అత్యంత కీలకమని చెప్పారు. దీనిని కూడా రాజకీయ కోణంలో చూసేవారికి దేశ భక్తి ఉంటుందా? అని ప్రశ్నించారు. వారు కూడా కసబ్ వంటివారేనని అన్నారు. కేటీఆర్ కూడా కసబ్ మాదిరిగా మారుతానంటే తనకేమీ అభ్యంతరం లేదన్నారు. ఈ వ్యాఖ్యలపై కేటీఆర్ ఎలా స్పందిస్తారో చూడాలి.

# ఇలాంటి పరిస్థితులను గతంలో ఎప్పుడూ చూడలేదు: సీఎం చంద్రబాబు

మొదటి పేజి తరువాయి౦



టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో టీడీపీ ప్రజాప్రతినిధులకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. కూటమి ప్రభుత్వ విజయాలు, టీడీపీ సభ్యత్వ నమోదు, పంచాయతీరాజ్ వ్యవస్థలు, సూపర్ సిక్స్, పల్లె పండుగ, సహా 8 అంశాలపై చర్చించారు. ప్రత్యేకంగా, లోక్ సభ స్థానాల పరిధిలోని సమస్యలను ఎంపీలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ... గత ఐదేళ్లలో జగన్ అన్ని వ్యవస్థలను సర్వనాశనం చేశారని వ్యాఖ్యానించారు. ఏ వ్యవస్థ కూడా సజావుగా పనిచేస్తోంది అనుకోవడానికి లేకుండా విధ్వంసం చేశారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులను కూడా దారిమళ్లించారని ఆరోపించారు. గతంలో ఎప్పుడూ కూడా ఇలాంటి పరిస్థితులను చూడలేదని అన్నారు. రాష్ట్రంలో ఏ అరాచకం చూసినా, దాని వెనుక ఏదో ఒక గంజాయి బ్యాచ్ ఉంటోందని, తప్పు చేసిన వాళ్లను మాత్రం విడిచిపెట్టే ప్రసక్తేలేదని చంద్రబాబు హెచ్చరించారు. అధికారంలోకి రాగానే ఏడు అంశాలపై శ్వేతపత్రాలు విడుదల చేశామని వెల్లడించారు. రాష్ట్రంలో ఇసుక, మద్యంపై కొత్త పాలసీలు తీసుకువచ్చామని చెప్పారు. అయితే ఇసుక, లిక్కర్ అంశాల్లోనే కాకుండా... ఇతర వ్యాపారాల్లోనూ ఎవరూ జోక్యం చేసుకోవద్దని టీడీపీ ప్రజాప్రతినిధులకు చంద్రబాబు స్పష్టం చేశారు. మాగుంట కుటుంబం ఎప్పటినుంచో లిక్కర్ వ్యాపారంలో ఉందని, ఆ విధంగా కుటుంబ వారసత్వంగా వచ్చే వ్యాపారాలు చేసుకుంటే ఫర్వాలేదని, కొత్తగా లిక్కర్ వ్యాపారంలోకి వెళ్లి ధనార్జన చేయాలని ప్రయత్నించవద్దని హెచ్చరించారు. నేతలకు విశ్వసనీయత రావాలంటే ఎంతో సమయం పడుతుందని, ఆ విశ్వసనీయత పోవడానికి నిమిషం చాలని... ఇది తనకు కూడా వర్తిస్తుందని చంద్రబాబు పేర్కొన్నారు.దేశ రాజకీయాల్లో ఎప్పటినుంచో ప్రముఖ పాత్ర పోషిస్తున్న పార్టీ తెలుగుదేశం పార్టీ అని అభివర్ణించారు. ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్న టీడీపీ శక్తిమంతమైన పార్టీగా ఆవిర్భవించిందని చంద్రబాబు పేర్కొన్నారు. టీడీపీ ఏనాడూ అధికారం కోసం అర్రులు చాచలేదని, దేశం కోసం, ప్రజల కోసం పాటుపడడమే టీడీపీకి పరమావధి అని వివరించారు. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు టీడీపీ సమర్థవంతమైన పాత్ర పోషించిందని చంద్రబాబు తెలిపారు. నాడు ఎలాంటి పదవులు తీసుకోకుండానే వాజ్ పేయి ప్రభుత్వంలో కొనసాగామని గుర్తు చేశారు. పార్టీ కూడా ఓ కుటుంబం వంటిదేనని, చిన్న చిన్న సమస్యలు ఉండడం సహజమేనని అన్నారు. "పార్టీలో ఉన్న వారు ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో ఉండాల్సిన అవసరం ఉంది. ఇప్పటి పరిస్థితుల్లో కార్యకర్త తప్పు చేసినా సీఎంపై ఆ ప్రభావం పడుతుంది. పార్టీ కూడా నష్టపోతుంది. మిమ్మల్ని ఎవరూ గమనించడంలేదు అనుకోవద్దు. ఇటీవల ఎన్నికల్లో అవతలి వారు బస్తాల కొద్దీ డబ్బులు వెదజల్లారు. కేవలం డబ్బుతోనే ఎన్నికలు జరుగుతాయనుకోవద్దు. మనపై నమ్మకంతోనే ప్రజలు ఓటేశారు. కేంద్రంలో అనుకూల ప్రభుత్వం వచ్చింది కాబట్టే క్రమంగా నిలదొక్కుకుంటున్నాం. కూటమిలో ఉన్నాం కాబట్టి మిగతా భాగస్వామ్య పార్టీలను కూడా సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలి" అంటూ చంద్రబాబు కర్తవ్య బోధ చేశారు.

# న్యాయం గెలిచిందంట... మరి వీటి సంగతేంటి?

మొదటి పేజి తరువాయి



ఈడీ స్కిల్ డెవలప్ మెంట్ కేసులో కొందరి ఆస్తులు అటాచ్ చేయగా... న్యాయం గెలిచిందంటూ టీడీపీ ట్వీట్ చేసింది. దీనిపై జగన్ విమర్శనాస్త్రాలు సంధించారు. "నిజం నిలిచిందంట... న్యాయం గెలిచిందంట... స్కిల్ డెవలప్ మెంట్ కేసులో అక్రమ కేసు పెట్టిన జగన్ కి చెంపపెట్టులా, చంద్రబాబు గారికి ఎటువంటి సంబంధం లేదని ఈడీ క్లీన్ చిట్ ఇచ్చిందని ఆ ట్వీట్ లో రాసుకున్నారు. నిజంగా ఏమైనా బుద్ధి, జ్ఞానం ఉన్నాయా? మనుషులను ఏమనుకుంటున్నాడు? మనుషులకు చదువు రాదనుకుంటాడా? మనుషులు చదవలేరనుకుంటాడా? మనుషులకు అసలేమీ తెలియదనుకుంటాడా? ఎంత ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5 మీడియా సామ్రాజ్యం ఆయనకు ఉంటే మాత్రం, ఎంతగా గోబెల్స్ ప్రచారం చేయగలనన్న అతి విశ్వాసం ఆయనకు ఉంటే మాత్రం... ఈ మాదిరిగా వక్రీకరించడం అన్నది ఎవరు చేయగలుగుతారు? స్కిల్ డెవలప్ మెంట్ కేసులో నిందితుల ఆస్తులను ఈడీ అటాచ్ చేస్తే, దీనికి సమాధానం ఏంటంటే చెప్పడు. సోషల్ మీడియాలో మాత్రం తనకు నచ్చినట్టుగా రాసుకుంటాడు... దీనికి ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5 వత్తాసు పలుకుతాయి. చంద్రబాబు ఎందుకు ఈ విధంగా అబద్ధాలకు రెక్కలు కడుతున్నాడు? అసలు ఈడీ ప్రెస్ నోట్ లో ఎక్కడైనా క్లీన్ చిట్ అనే ప్రస్తావన ఉందా? సుమన్ బోస్, వికాస్ ఖాన్విల్కర్ లకు డబ్బులు ఎక్కడ్నించి వెళ్లాయి? వీళ్లకు ఈ డబ్బులు ఎవరిచ్చారు? నాడు చంద్రబాబు 13 చోట్ల సంతకాలు పెట్టి రూ.371 కోట్లు విడుదల చేయడం వాస్తవం కాదా? ఆ డబ్బులు మాకు ముట్టలేదు అని సీమెన్స్ కంపెనీయే చెప్పిన మాట వాస్తవం కాదా? తమకు ఎలాంటి డబ్బులు ముట్టలేదని జర్మనీకి చెందిన సీమెన్స్ ఒరిజినల్ కంపెనీ నోయిడాలోని మేజిస్ట్రేట్ ముందు వాంగ్మూలం ఇవ్వడం వాస్తవం కాదా? ఆ డబ్బు పుణే నుంచి హైదరాబాద్ వెళ్లినట్టు సీమెన్స్ సంస్థ అంతర్గత విచారణలో వెల్లడి కాలేదా? ఇలా బయటికి వెళ్లిన డబ్బులను దారిమళ్లించిన మాట వాస్తవం కాదా? అలా బయటికి వెళ్లిన సొమ్ము తిరిగి హవాలా మార్గంలో చంద్రబాబు జేబులోకి చేరడం వాస్తవం కాదా? రాబోయే రోజుల్లో చంద్రబాబును, ఆయన పీఎస్ శ్రీనివాస్ ను ఈడీ అరెస్ట్ చేయదా? దొంగలు దొంగలు కలిసి ఊళ్లు పంచుకోవడం అంటే ఇది కాదా? తాము చంద్రబాబు ఆదేశాల మేరకు డబ్బు విడుదల చేశామని ఇద్దరు ఐఏఎస్ అధికారులు 164 సెక్షన్ కింద మేజిస్ట్రేట్ ఎదుట వాంగ్మూలం ఇచ్చారు... ఇది వాస్తవం కాదా? మరి, కళ్లెదుటే ఇవన్నీ కనిపిస్తుంటే చంద్రబాబు ఏమంటున్నాడు... నిజం నిలిచింది... న్యాయం గెలిచిందంట!" అంటూ జగన్ తూర్పారబట్టారు.

# ఏపీలో ఇక రూ.99ల క్వార్టర్ బాటిల్ కూడా లభ్యం

అమరావతి : ఏపీలో నూతన ఎక్సైజ్ పాలసీలో భాగంగా ప్రైవేటు మద్యం షాపులు అందుబాటులోకి వచ్చాయి. అయితే ప్రభుత్వం ప్రకటించిన విధంగా చౌక ధర మద్యం పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాకపోవడంతో మందు బాబులు నిరుత్సాహానికి గురవుతున్నారు. ప్రైవేటు మద్యం షాపుల్లో వివిధ రకాల బ్రాండ్లు అందుబాటులో ఉన్నా ప్రభుత్వం ప్రకటించిన రూ.99ల క్వార్టర్ బాటిళ్ల మద్యం అందుబాటులో లేకపోవడంతో షాపుల నిర్వాహకులతో మందుబాబులు గొడవ పడుతున్నారు. తక్కువ ధర మద్యం ఎప్పుడు వస్తుందంటూ నిలదీస్తున్నారు. దీంతో రాష్ట్ర ఎక్సైజ్ అధికారి మందు బాబులకు గుడ్ న్యూస్ అందిస్తూ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిన విధంగా రూ.99లకు క్వార్టర్ బాటిల్ మద్యం అందుబాటులోకి వచ్చిందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ సంచాలకులు నిశాంత్ కుమార్ తెలిపారు. మద్యం తయారీ విక్రయాలలో జాతీయ స్థాయిలో పేరు ప్రతిష్టలు కలిగిన ఐదు సంస్థలు ఆంధ్రప్రదేశ్‌లో ఈ ధరకు మద్యం విక్రయాలు చేసేందుకు సిద్దం అయ్యాయని తెలిపారు. గురువారం నాటికి పది వేల కేసుల రూ.99 మద్యం మార్కెట్ కు చేరిందని, సోమవారం నాటికి రోజువారీ సరఫరా 20వేల కేసులకు చేరుతుందని ఆయన వివరించారు. దశల వారీగా సరఫరా పెరిగి ఈ నెలాఖరు నాటికి 2,40,000 కేసుల మద్యం రాష్ట్రంలో అందుబాటులో ఉంటుందన్నారు. ఈ క్రమంలో మొత్తంగా కోటి ఇరవై లక్షల క్వార్టర్ సీసాల మద్యం ఈ నెలలో అందుబాటులోకి రానుందని తెలిపారు. వినియోగాన్ని అనుసరించి తదుపరి నెలలలో ఏ మేరకు దిగుమతి చేసుకోవాలన్న దానిపై నిర్ణయం తీసుకుంటామని నిశాంత్ కుమార్ వివరించారు.

# టైమ్... డేట్ మీరు నిర్ణయిస్తారా? నన్ను నిర్ణయించమంటారా?

## : రేవంత్ రెడ్డికి హరీశ్ రావు సవాల్

మొదటి పేజి తరువాయి



మూసీ పరీవాహక ప్రాంతం వద్దకు, ఆ తర్వాత కొండపోచమ్మ, మల్లన్నసాగర్, రంగనాయక సాగర్‌కు వెళ్దామని... అక్కడి వారిని కలిసి మాట్లాడుదామన్నారు. రేపు కుదరదంటే టైమ్... డేట్ మీరు నిర్ణయిస్తారా? నన్ను నిర్ణయించ మంటారా? అని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి నిన్న పెట్టిన ప్రెస్ మీట్‌పై ఆయన తీవ్రంగా స్పందించారు. "ముఖ్యమంత్రి గారికి నేను ఛాలెంజ్ విసురుతున్నాను. మీరు డేట్ నిర్ణయిస్తారా? నన్ను నిర్ణయించమంటారా? పోదాం... రేపు రమ్మంటే ఉదయం తొమ్మిది గంటలకు మీ ఇంటికి వస్తాను... లేదు మీకు ఏదైనా బిజీ షెడ్యూల్ ఉందంటే ఇంకో డేట్ టైమ్... మీరే ఇవ్వండి. కారు నేనే డ్రైవింగ్ చేస్తాను. నువ్వు పక్కన కూర్చో... ఇద్దరమే వెళ్దాం... గన్‌మన్‌లు లేకుండా వెళదామని చెప్పావు కదా... అక్కడి నుంచి నేరుగా మూసీ పరీవాహక ప్రాంతం వద్దకు వెళ్లి... అక్కడి బాధితులను కలుద్దాం... అక్కడి నుంచి కొండపోచమ్మ సాగర్‌కు వెళదాం... అక్కడి నుంచి మల్లన్న సాగర్ వద్దకు వెళదాం... అక్కడి నుంచి రంగనాయక సాగర్ వెళదాం... రేపు వెళదామా? ఎల్లుండి వెళదామా? రేపు ఉదయం తొమ్మిది గంటలకు నేను రెడీ" అని సవాల్ చేశారు. అబద్ధమే ఆశ్చర్యపడేలా రేవంత్ రెడ్డి నిన్న ప్రెస్ మీట్ పెట్టారని విమర్శించారు. సీఎం ఎలాంటి ఆలోచన లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మూసీకి ఆయన ఇచ్చిన నిర్వచనాలు విని జనం నవ్వుకుంటున్నారన్నారు. ప్రెస్ మీట్‌లో సీఎం రేవంత్ రెడ్డి ఏఐ టెక్నాలజీని చూపించారన్నారు. నీటితో కళకళలాడేలా నదిని బాగు చేయడమే పునరుజ్జీవమన్నారు. రివర్ ఫ్రంట్ అంటే ఏమిటి? దాని స్టంట్ ఏమిటో ముఖ్యమంత్రి చెప్పాలన్నారు. నదిని శుభ్రం చేయడం నుంచే పనులు ప్రారంభం కావాలన్నారు. మూసీ సుందరీకరణలో భాగంగానే తాము 31 ఎస్టీపీలు నిర్మించామని తెలిపారు. మూసీలో పారిశ్రామిక వ్యర్థాలు కలవకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అసలు పని వదిలిపెట్టి హైడ్రా పేరుతో ఇళ్లు కూల్చుడంపై దృష్టి సారించారని మండిపడ్డారు.

# 'సాక్షి'పై పరువునష్టం కేసులో వైజాగ్ కోర్టుకు మంత్రి నారా లోకేశ్

అమరావతి : తన పరువుకు భంగం కలిగించేలా అసత్య కథనాలు ప్రచురించారంటూ సాక్షి దినపత్రికపై వేసిన పరువు నష్టం కేసులో మంత్రి నారా లోకేశ్ నేడు విశాఖ కోర్టుకు హాజరయ్యారు. సాక్షి పత్రికపై రూ. 75 కోట్లకు పరువునష్టం దావా వేసిన లోకేశ్ తరపు న్యాయవాదులు నేడు కోర్టులో వాదనలు వినిపించనున్నారు. 'చినబాబు తిండికి 25 లక్షలండి' పేరుతో 2019 అక్టోబర్ 22న సాక్షి ఓ కథనాన్ని ప్రచురించింది. అందులో పేర్కొన్న అంశాలన్నీ పూర్తిగా అవాస్తవమని, తనను అప్రతిష్ఠపాలు చేసేందుకు దురుద్దేశపూర్వకంగా తప్పుడు కథనం రాశారంటూ కథనం ప్రచురితమైన మూడో రోజున అంటే 25న సాక్షి సంపాదక బృందానికి లోకేశ్ న్యాయవాదులు నోటీసులు పంపారు. దీనిపై స్పందించిన సాక్షి అదే ఏడాది నవంబర్ 10న సమాధానం పంపింది. దీనిపై సంతృప్తి చెందని లోకేశ్ ఆ సంస్థపై పరువునష్టం దావా వేశారు. విశాఖ విమానాశ్రయంలో తాను చిరుతిళ్లు తిన్నట్టు వార్తలో పేర్కొన్న తేదీల్లో తాను ఇతర ప్రాంతాల్లో ఉన్నానని, అయినప్పటికీ దురుద్దేశంతో తన పరువుకు భంగం కలిగించేలా రాజకీయ లబ్ధికోసం అసత్యాలతో కథనం ప్రచురించారని లోకేశ్ తన దావాలో పేర్కొన్నారు. దీనికి బాధ్యులైన సాక్షి సంస్థ జగతి పబ్లికేషన్స్ లిమిటెడ్, సాక్షి ప్రచురణ కర్త మురళి, విశాఖ సాక్షి న్యూస్ రిపోర్టర్లు వెంకటరెడ్డి, ఉమాకాంత్‌లపై రూ. 75 కోట్లకు పరువునష్టం దాఖలు చేశారు.

## వాంగ్మూలం తీసుకుంటామని చెప్పినా మళ్లీ సమయం ఎలా కోరుతారు?: కేటీఆర్‌కు కోర్టు ప్రశ్న

హైదరాబాద్ : వాంగ్మూలం తీసుకుంటామని చె ప్పినప్పటికీ మళ్లీ సమయం ఎలా కోరుతారని బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను నాంపల్లి కోర్టు ప్రశ్నించింది. మంత్రి కొండా సురేఖపై కేటీఆర్ పరువు నష్టం దావా వేశారు. ఈ పిటిషన్‌పై ఇటీవల విచారణ జరిపిన నాంపల్లి ప్రత్యేక న్యాయస్థానం ఈరోజు కేటీఆర్ సహా సాక్షుల వాంగ్మూలాన్ని నమోదు చేస్తామని తెలిపింది. అయితే కేటీఆర్ కోర్టుకు హాజరు కాలేదు. అనివార్య కారణాల వల్ల కేటీఆర్ ఈరోజు వాంగ్మూలం నమోదు చేయడానికి కోర్టుకు హాజరు కాలేపోతున్నారని ఆయన తరఫు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. వాంగ్మూలం నమోదు చేయడానికి సమయం ఇవ్వాలని కోరారు. సోమవారం లేదా బుధవారం సమయం ఇవ్వాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఈ సమయంలోనే... ఈరోజు వాంగ్మూలం తీసుకుంటామని చెప్పినప్పటికీ మళ్లీ సమయం కోరడమేమిటని కోర్టు ప్రశ్నించింది. అనంతరం బుధవారం కేటీఆర్ స్టేట్‌మెంట్ రికార్డ్ చేస్తామని స్పష్టం చేసింది.

## సద్గురు జగ్గీ వాసుదేవ్ కు భారీ ఊరట -ఆ ఇద్దరు మహిళలు అక్కడే ఉండొచ్చన్న సుప్రీం..!



ఇద్దరు మహిళలను బలవంతంగా నిర్బంధించారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న తమిళనాడులోని సద్గురు జగ్గీ వాసుదేవ్ కు చెందిన ఇషా ఫౌండేషన్ కు సుప్రీంకోర్టులో భారీ ఊరట దక్కింది.ఆ ఇద్దరు మహిళల తల్లితండ్రులు దాఖలు చేసిన ఫిర్యాదు ఆధారంగా గతంలో మద్రాస్ హైకోర్టు ఇషా ఫౌండేషన్ పై కేసులు నమోదు చేసి విచారణకు ఆదేశించింది. అయితే దీన్ని సవాల్ చేస్తూ ఇషా ఫౌండేషన్ దాఖలు చేసిన పిటిషన్ పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ఇషా ఫౌండేషన్ కు ఊరటనిచ్చింది. తమిళనాడుకు చెందిన ఇద్దరు మహిళలు ఇష్టపూర్వకంగా తాము ఇషా ఫౌండేషన్ లో చేరామని గతంలో తెలిపారు. అయితే వారి తల్లితండ్రులు మాత్రం సద్గురు ఆశ్రమం తమ పిల్లల్ని వారికి ఇష్టం లేకపోయినా సన్యాసినులుగా మారుస్తోందంటూ ఆరోపించారు. దీంతో మద్రాస్ హైకోర్టు జోక్యం చేసుకుని విచారణకు ఆదేశించింది. అయితే సుప్రీంకోర్టులో జరిగిన విచారణలో మాత్రం ఆ ఇద్దరు మహిళలు వారి ఇష్టప్రకారమే అక్కడ ఉంటున్నట్లు తేలింది.మహిళల తల్లిదండ్రులు దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌పై పోలీసు దర్యాప్తు కోసం మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సుప్రీంకోర్టు పక్కనబెట్టింది. ఆ ఇద్దరు మహిళలు ఇష్టప్రకారమే ఇషా ఫౌండేషన్ లో ఉంటున్నారని వెల్లడించినందున ఈ కేసును కొనసాగించాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు తేల్చింది. ఇద్దరు మహిళలతో వర్చువల్ గా మాట్లాడిన ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ వారి స్టేట్‌మెంట్‌లను రికార్డ్ చేశారు. ఇద్దరు మహిళలు తమ ఇష్టానుసారం ఆశ్రమంలో నివసిస్తున్నారని వాంగ్మూలం ఇవ్వడంతో కేసును ఉపసంహరించుకోవాలని ఆయన పేర్కొన్నారు.

## విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై ఆర్థిక భారం వేయడం అన్యాయం

### తక్షణమే ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి - సిపిఐ (ఎం) డిమాండ్



టంగుటూరు, మండల రిపోర్టర్ – వెంకటేశ్వర్లు (శుభోదయం న్యూస్) : తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచమని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యుత్ సర్దుబాట్ల పేరుతో రాష్ట్ర ప్రజలపై 20 వేల కోట్ల రూపాయలు అదనపు భారం మోపిందని సిపిఐ(ఎం) శుక్రవారం ఆరోపించింది. స్థానిక పట్టణ విద్యుత్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమంలో భాగంగా వక్తలు మాట్లాడుతూ ప్రస్తుతం నిత్యవసర సరుకుల ధరలు ఒకవైపు మిన్నడుతున్నాయని మరోవైపు రాష్ట్రాన్ని వరదలు ముంచెత్తుతున్నాయని ఇటువంటి పరిస్థితులల్లో ప్రస్తుత కూటమి ప్రభుత్వం గత వైసిపి ప్రభుత్వం వలె ప్రజలకు ఉపశమనం కలిగించకపోగ విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలను ఆర్థికంగా వేధించడం ఎంతవరకు సబబన్నారు. కనుక ఇటువంటి తప్పుడు నిర్ణయాలను ప్రభుత్వం వెంటనే ఉపసంసరించుకోవాలని సిపిఎం డిమాండ్ చేస్తుందన్నారు. లేకుంటే గతంలో జరిగిన విధంగా మరో విద్యుత్ పోరాటానికి సిపిఎం శ్రేణులు సన్నద్ధమవడం ఖాయమన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఎం నాయకులు టి రాము వి మోజెస్ పాపారావు రామారావు యానాది బుల్లియ్య శ్రీనివాస్ తదితర పార్టీ శ్రేణులు పాల్గొనడం జరిగింది.

## సాదా సిదాగా యర్రగొండపాలెం మండల సర్వసభ్య సమావేశం




యర్రగొండపాలెం, మండల రిపోర్టర్ – నారాయణ (శుభోదయం రిపోర్టర్): తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత మొదటి సారిగా వైసీపీ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు సర్వసభ్య సమావేశం జరుపు తుండటంతో, తెలుగుదేశం పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు పలుసమస్యలమీద సభను స్పందింప జెస్తారు, నిలదీస్తారు, అనే చర్చ సాగింది, అసలు వారు హాజరుకాక పోవాడంతో




యర్రగొండపాలెం మండల సర్వసభ్యసమావేశం సాదాసిదాగా జరిగింది.యర్రగొండపాలెం మండల సర్వసభ్య సమావేశం యంపీపీ కిరణ్ గౌడ్ అధ్యక్షత యర్రగొండపాలెం మండలపరిషత్ కార్యాలయ సమావేశమందిరంలో జరిగింది. ఈ సమావేశానికి దాదాపుగా అన్ని శాఖల అధికారులు హాజరయ్యారు.తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన తరువాత గ్రామాల్లో జరిగే ప్రభుత్వ కార్యాక్రమాలకు వైసీపీ సర్పంచులకు అహ్వానం ఉండటం లేదని వైసీపీ సర్పంచులు నిలదీసారు ప్రోటోకాల్ విషయంలో తెలుగుదేశం పార్టీ ఇన్చాంర్జ్ పై కొందరు అరోపణలను చేసారు , ఇన్చార్జి పై వైసిపి వాళ్లు చేసిన ఆరోపణలు ను తెలుగుదేశం పార్టీ కి చెందిన ఒకరిద్దరు పాల్గొన్నప్పటికి వారు ఖండించకపోవడంతో విమర్శలు వస్తున్నాయి, చివరకు ఎంపీడీవో శ్రీనీవాసులు కలుగజేసుకొని పలు ఆరోపణలకు సమాదాన పరిచారు. ఈ కార్యాక్రమంలో యంపిడివోబండారు శ్రీనీవాసరావు , %జూ=ణ% ఈదుల రాజశేఖరరెడ్డి, డిప్యూటి తహాశీల్దారు నలగాటి మల్లిఖార్జున నాయుడు, సర్పంచులు, యంపీటీసీలతో పాటు పలుశాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు .....

## మధురానగర్ వాసుల చిరకాల వాంఛ ఆర్ యు బి ని ప్రారంభిచిన కేసినేని చిన్ని



సెంట్రల్ రిపోర్టర్ – కృష్ణారావు : (శుభోదయం న్యూస్ ), విజయవాడ : మధురా నగర్ వాసుల చిరకాల వాంఛ మధురనగర్ – భాను నగర్ రైల్వే ఆర్ యూ బి రహదారిని విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ చిన్ని ,సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు బొండా ఉమామహేశ్వరరావు గారు ప్రారంభించారు. మధురానగర్ వాసుల చిరకాల కల నేడు నెరవేరిందన్నారు, ఆర్ యూ బి నిర్మాణానికి టిడిపి హయంలో నాటి ఎమ్మెల్యేగా తాను శంకుస్థాపన చేశానని, ఇప్పుడు ప్రారంభోత్సవం టిడిపి పాలనలోనే జరిగిందన్నారు, గత వైఎస్ఆర్సిపి ప్రభుత్వం ఆర్ యు బి నిర్మాణం సకాలంలో చేపట్టకుండా ప్రజలను ఇబ్బందులు పెట్టిందన్నారు. 9 నెలల కాలంలో పూర్తి కావలసిన ఆర్ యూ బి నిర్మాణం వైఎస్ఆర్సిపి పాలనలో అటకెక్కిందన్నార, వైసిపి పాలనలో అభివృద్ధి కంటే అవినీతి ఎక్కువ జరిగిందన్నారు, టిడిపి ప్రభుత్వం వచ్చిన తర్వాతే ఆర్ యు బి నిర్మాణం పూర్తయిందని, నేడు ప్రారంభోత్సవం కూడా జరిగిందని. అదేవిధంగా గుణదల దగ్గర ఆగిపోయిన ఫ్లైఓవర్ కూడా నిర్మాణం పూర్తి చేస్తామన్నారు, ఎంపీ కేశినేని శివనాద్ చిన్ని సహకారంతో రైల్వే అధికారులతో మాట్లాడి వాంబే కాలనీ వద్ద కూడా ఆర్ యు బి నిర్మాణానికి చర్యలు చేపడతా మనీ చెప్పారు. మధురా నగర్ వాసుల చిరకాల కోరిక ఆర్ యూత్ యూ బి ని నేడు ప్రారంభం చేయటం సంతోషం గా వుందన్నారు, రైల్వే అధికారులతో మాట్లాడి పనులు వెంటనే పూర్తి చేసి ఆర్ యూ బి ని అందుబాటులోకి తీసుకువచ్చిన ఘనత టిడిపి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు, సెంట్రల్ నియోజకవర్గం లో జరిగే అభివృద్ధి పనుల్లో నేను కూడా భాగస్వామ్యం అవుతాననీ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వీరమాచినేని లలిత, నవనీతం సాంబశివరావు, జనసేన సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త బొలిశెట్టి వంశీకృష్ణ, డివిజన్ కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి ,డివిజన్ అధ్యక్షులు పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు, డివిజన్ ఇంచార్జ్ గౌతమ్ ప్రసాద్, సింగం వెంకన్న, వీరమాచినేని కిషోర్, జనసేన శ్యాం ప్రసాద్, బర్మా శ్రీను, అడపా కోటేశ్వరరావు, జనసేన కేంబూరి కృష్ణ, తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## భూలక్ష్మమ్మ పూజలో మాజీ ఎమ్మెల్యే కొప్పుల




పరిగి, నియోజకవర్గం రిపోర్టర్ – విజయ్, (శుభోదయం న్యూస్): దోమ మండలం కిష్టాపూర్ గ్రామంలో మాజీ జడ్పీటీసీ కొప్పుల నాగిరెడ్డి నిర్వహించిన భూలక్ష్మమ్మ పూజ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి పాల్గొని అమ్మ వారి ఆశీష్యులు పొందారు.అమ్మ వారి కోసం నిర్వహించిన ఊరేగింపులో స్థానికులతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమం వికారాబాద్ జిల్లా మాజీ జడ్పీటీసీలు మండల సర్పంచుల సంగం అధ్యక్షులు కె.రాజిరెడ్డి,వైస్ ఎంపీపీ మల్లేశం, గోపాల్ గౌడ్,స్థానిక నాయకులు, పలు గ్రామాల ప్రజా ప్రతినిధులు కార్య కర్తలు,మండల ప్రజలు పాల్గొన్నారు.

# మరో బుడమేరు కానుందా పామూరు....?

### ఒకరోజు వర్షం కురిస్తేనే లోతట్టు ప్రాంతాలు జలమయం...

### వారం పాటు వర్షం కురిస్తే.... మన కళ్ళముందే బుడమేరు కనిపిస్తుంది...



ప్రకాశం జిల్లా బ్యూరో– చంద్ర (శుభోదయం న్యూస్): వాగులు మాయం, వంకలు మాయం, కల్వర్టులు మాయం పైవన్నీ మాయం అయినప్పుడు గృహాలు కూడా నీట మునిగి మాయం కావడంలో అతిశయోక్తి ఏముంది అంటున్నారు సగటు పట్టణ ప్రజలు. కేవలం ఒకరోజు వర్షానికే పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఇండ్లలోకి నీరు పోయిన సందర్భాలు రెండు రోజుల కిందట చూసాము. అదే ఒక వారం పాటు భారీ వర్షాలు పడితే పలు ప్రాంతాలు కాదు అన్ని ప్రాంతాల్లో ఇండ్లు నీట మునిగే ప్రమాదం ఉంది అని పలువురు విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

**పాత చెరువులోకి నీరు వచ్చే మార్గాలు పూర్తిగా ఆక్రమణ ల చెరలో**

పట్టణంలో ఉన్న పురాతన చెరువు (కనిగిరి రోడ్డులో ఉన్న)కు వర్షపు నీరు వచ్చే కాలువలు, కుంటలు, వంకలు, వాగులు ప్రస్తుతం భూతద్దం వేసి వెతికినా కూడా కనపడవు అని గ్రామస్తులంటున్నారు. నీరు వచ్చే ప్రతి మార్గం ప్లాట్లుగా మారాయని వారు ఆరోపించారు. భారీ వర్షాలు నమోదైతే కచ్చితంగా పట్టణంలోని ప్రతి ఇంటిలోకి వరద నీరు వచ్చే అవకాశం ఉందని స్పష్టం చేశారు.

**కొత్త చెరువులోకి నీరు వచ్చే మార్గాలు కూడా పూర్తిగా ఆక్రమణల చెరలో**

కందుకూర్ రోడ్ లో ఉన్న కొత్త చెరువుకి కూడా వర్షపు నీరు వచ్చే అవకాశాలు పూర్తిగా సన్నగిల్లాయి. అన్ని ప్రాంతాల్లో ఉన్న వాగులు వంకలు ఆక్రమణలకు గురై ప్లాట్లుగా మారడంతో వర్షపు నీరు చెరువులోకి వెళ్లే మార్గం లేక నివాస గృహాల్లోకి రావడం పరిపాటిగా మారిందని పలువురు కాలనీవాసులు అంటున్నారు. రెండు రోజులు కిందట కురిసిన వర్షాలతో పట్టణంలోని పలు ప్రాంతాల్లో కాలు బయట పెట్టే పరిస్థితి కూడా లేదని గ్రామస్తులు వాపోయారు. అదే కంటిన్యూగా వర్షం పడితే విజయవాడలో చూసిన బుడమేరు పరిస్థితి మన కళ్ళ ముందు కనపడేదని పలువురు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు భవిష్యత్తు నీటి ప్రమాదాలను నివారించేందుకు ముందు జాగ్రత్త చర్యలుగా కాలువలు కుంటలు ఆక్రమణల చెర నుంచి విముక్తి అయితే తప్పక ప్రమాదాలను నివారించలేమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముందు ముందు చూడాలి అధికారులు ఏ మాత్రం స్పందిస్తారో , ఏమాత్రం పరిష్కరిస్తారో వేచి చూడాలి

## మంత్రి సీతక్కకి ఘన స్వాగతం పలికిన బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి






మంచిర్యాల, జిల్లా ప్రతినిధి – శ్రీనివాస్, (శుభోదయం న్యూస్ ): కాసిపేట మండలం కల్వరి మినిస్ట్రీస్ పాస్టర్ ప్రవీణ్, సిస్టర్ షారోన్ ల ఆధ్వర్యంలో నిర్వహించిన 50రోజుల ఉవాసం ప్రార్థన ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిధి గా పంచాయతీరాజ్, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క రావడం జరిగింది. ఈ సందర్భంగా బెల్లంపల్లి నియోజకవర్గ శాసనసభ్యులడు గడ్డం వినోద్ వెంకటస్వామి, మాజీ మంత్రి వేణుగోపాల్ చారి, ఎమ్మెల్సీ దండే విట్టల్, బెల్లంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ జక్కుల శ్వేతా శ్రీధర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సీతక్కకు ఘన స్వాగతం పలికారు. ఈ 50 రోజుల ఉపవాస ప్రార్థన ముగింపు సభ కార్యక్రమానికి వివిధ రాష్ట్రల నుంచి లక్షల మంది భక్తులు పాల్గొని ప్రార్థనలు చేపట్టారు.

## తప్పి పోయిన బాలుడిని చేర దీసిన స్వచ్ఛంద సంస్థ....

### మాజీ సర్పంచ్ కె. రాజిరెడ్డి సమక్షములో తండ్రికి అప్పగింత



దోమ, (శుభోదయం న్యూస్): మూడేళ్ల క్రితం తప్పిపోయిన బాలుడిని తల్లి తండ్రి ల చెంతకు చేరదీసిన ఎస్ కె సి వి చిల్డ్రన్స్ ట్రస్ట్ వారిని దోమ మండల సర్పంచుల సంగం మాజీ అధ్యక్షులు కె.రాజిరెడ్డి అభినందించారు. వివరాల్లోకి వెళ్తే దోమ గ్రామానికి చెందిన ఒక్క బాబు,యాదమ్మ తనయుడు బొక్క భరత్ కుమార్ పదేళ్ల వయసులో తప్పోపోయాడు.తల్లి దండ్రులకు మనస్పర్థలు ఉండడం తో పదేళ్ల వయసులో తల్లి వెంబడి ఉన్న పవన్ బతుకు దెరువు నిమిత్తం పట్టణానికి వలస వెళ్లడం తో అక్కడే పవన్ తప్పిపోయాడు. నిరక్ష రాస్యులు కావడం తో ఎలాంటి పిర్యాదు కూడా చేయలేదు. బాలుడు పదేళ్ల కింద విజయవాడ రైల్వే స్టేషన్ లో ఒంటరిగా కనబడం తో విజయవాడకు చెందిన ఎస్ కె సి వి సంస్థ కు చెందిన సభ్యులు బాలుడిని చేరదీసి వారి క్యాంపు లో పెట్టారు. పదేళ్ల తరువాత పిల్లలకు సంస్థ వారు కౌన్సిలింగ్ ఇచ్చే క్రమంలో పిల్లలు తమ స్వంత గ్రామం తల్లిదండ్రుల పేర్లు చెప్పడం తో వారిని వారి స్వంత గ్రామాలకు చేర్చి స్థానిక ప్రజా ప్రతినిధులు పోలీస్ శాఖ వారి ఆధ్వర్యంలో పిల్లలను అప్పాజెప్పుతారు.అదే క్రమంలో శుక్రవారం బాలుడు పవన్ తో వచ్చి స్థానిక సర్పంచ్ కె.రాజిరెడ్డి మరియు పోలీస్ వారి సమక్షంలో భరత్ ను వారి తండ్రి బొక్క బాబు కు అప్పాజెప్పారు.అనంతరం బాలుడిని ఏదైనా రెసిడెన్సియల్ స్కూల్ లో చేర్పించండి. అని మాజీ సర్పంచ్ కె.రాజిరెడ్డి సంస్థ వారిని కోరగా అందుకు వారు స్పందించి సంబంధిత అధికారుల ద్వారా రెసిడెన్సియల్ పాఠశాలలో చేర్పించేందుకు తండ్రి అనుమతి తో మళ్ళీ పాఠశాల లో చేర్పిస్తామని చెప్పారు. ఎందుకు సంస్థ కృషిని రాజిరెడ్డి కొనియాడారు.


## వర్కింగ్ జర్నలిస్టులకు ఇంటి స్థలం ఇవ్వాలని కలెక్టర్ కు వినతి పత్రం అందజేసిన డిజెఎఫ్ జిల్లా కమిటీ




రామగుండం, మండలం రిపోర్టర్ – తిరుపతి, (శుభోదయం న్యూస్): అక్రిడేషన్తో సంబంధం లేకుండా వర్కింగ్ జర్నలిస్టులందరికి ఇండ్లు లేదా ఇంటీ స్థలం ఇవ్వలని పెద్దపల్లి జిల్లా డెమొక్రటిక్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (డిజేఎఫ్) కమిటీ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షకు వినతిపత్రం అందజేశారు. డెమోక్రటిక్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి సబితం లక్ష్మణ్,పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు కల్లేపల్లి కుమార్ మాట్లాడుతూ ఎటువంటి జీతభత్యాలు లేకుండా ఏక్కడ సమస్య ఉంటే అక్కడ మేమున్నామంటూ పరుగులు తీసె విలేకరులకు ప్రభుత్వం తగు గౌరవాన్ని అందించాలని ప్రతి ఒక్క వర్కింగ్ జర్నలిస్టుకు ఇళ్ల స్థలాలను అందించాలని వారి సేవలను ప్రభుత్వం గుర్తించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా డీజేఎఫ్ వర్కింగ్ జర్నలిస్టులందరికీ న్యాయం జరిగేంత వరకు ఈ కార్యక్రమాలను చేపడుతుందని కచ్చితంగా ఇళ్ల పట్టాలను సాధించే వరకు పోరాడుతామని డిజెఫ్ తరపున ప్రతి ఒక్క జర్నలిస్ట్ వర్కింగ్ జర్నలిస్టుకి అన్ని రకాల ప్రతిఫలాలను పొందే వరకు పోరాడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి సభ్యత లక్ష్మణ్, జిల్లా అధ్యక్షులు కల్లేపల్లి కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిని ప్రసాద్, జాయింట్ సెక్రెటరీ మహంకాళి సంపత్, సెక్రటరీ జాన్, వర్కింగ్ ప్రెసిడెంట్ మామిడిపల్లి శ్రీనివాస్, సమన్వయ కమిటీ చైర్మన్ తాండ్ర శ్రీనివాస్, వైస్ చైర్మన్ చాట్ల ఆశాద్రి, ప్రచార కార్యదర్శి కన్నం అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

## ఫుట్ పాత్ ఆక్రమణలను తొలగించిన నగరపాలక సిబ్బంది

### నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్ ఎ సి) అరుణ శ్రీ ఆదేశాల మేరకు...





రామగుండం, మండలం రిపోర్టర్ – తిరుపతి, (శుభోదయం న్యూస్): రామగుం డం నగర పాలక సంస్థ కమీషనర్ (ఎఫ్ ఎ సి ) అరుణశ్రీ ఆదేశాల ప్రకారం మునిసిపల్ కార్యాలయం నుండి గోదావరి ఖని చౌరస్తా వరకు రోడ్డుకు ఇరువైపులా ఫుట్ పాత్ పై ఉన్న ఆక్రమణలను రామగుండం నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు తొలగిస్తున్నారు. గురువారం ప్రారంభమైన ఈ ఆక్రమణల తొలగింపు కార్యక్రమం శుక్రవారం కూడా కొనసాగింది. శనివారం కూడా ఫుట్ పాత్ ఆక్రమణలను తొలగించే కార్యక్రమం కొనసాగుతుందని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

## సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కరపత్రం విడుదల...

### సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.వెంకటయ్య



దోమ, (శుభోదయం న్యూస్): సిపిఎం వికారాబాద్ జిల్లా మూడవ మహాసభలు అక్టోబర్ 19,20తేదీలలో తాండూర్ పట్టణంలో జరగబోయే ఈ మహాసభలను జయప్రదం చేయాలని నేడు సిపిఎం ఆధ్వర్యంలో దోమ మండలం అంబేద్కర్ విగ్రహం ముందు కరపత్రం విడుదల చేయడం జరిగింది.ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.వెంకటయ్య మాట్లాడుతూ.. కార్మిక కర్షక పేదల పక్షపాతి సిపిఎం మహాసభలు రెండు రోజులపాటు తాండూరు పట్టణంలో నిర్వహించబోతున్నాము. మొదటి రోజు ర్యాలీ,భారీ బహిరంగ సభ, రెండోరోజు 200 ప్రతినిధుల సభ జరుగుతుంది. ఈ బహిరంగ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం గారు, రాష్ట్ర నాయకత్వం పాల్గొంటున్నారు. బహిరంగ సభలో జిల్లా ప్రజానీకం పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలలో జిల్లాలోని కార్మిక, రైతాంగ,వ్యవసాయ కార్మికులు మరియు ప్రజా వ్యతిరేక విధానాలు, ప్రజల స్థితిగతులపై చర్చించి జిల్లా అభివృద్ధి కొరకు జిల్లా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఏ రకమైనటువంటి భవిష్యత్తు ఏలాంటి పోరాటాలు రూపొందించాలని, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాల తిప్పి కొట్టే విధంగా,ప్రజలకు ఇచ్చినటువంటి హామీల అమలు కోసం ప్రభుత్వాలపై నిర్వహించబోయే ఉద్యమ కార్యాచరణ, రాజకీయ ఎత్తుగడలతో రూపొందించి, పార్టీ అభివృద్ధికున్న అవకాశాలు వంటి అంశాలపై ఈ మహాసభలు ఉత్తేజపూరితంగా నిర్వహించబడుతుందని అన్నారు. ఈ జిల్లా మహాసభల బహిరంగ మొదటి బహిరంగా సభలో ప్రజానీకం పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు,సత్తయ్య,రఘురాం,ఎహ్. సత్యయ్య,శేఖర్,అశోక్,మొగులయ్య,వెంకటయ్య,చెన్నయ్య,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## వీఆర్వో లను నియమించడంలో విఫలమైన అధికారులు: సిపిఐ (యం యల్ ) బరేషన్ పార్టీ




నంద్యాల, మండల రిపోర్టర్ - మోహన్ (శుభోదయం న్యూస్): నంద్యాల పట్టణంలో వున్న సచివాలయాలలో వీఆర్వోలను ఇంచార్జి లను నియమించడంలో అధికారులు విఫలమైయ్యారని అందువలన ఎంతోమంది విద్యార్థులు వివిధ పోస్టులకు అప్లై చేసుకోవాల్సిన పరిస్థితులో వీఆర్వో లు లేకపోవడం వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సిపిఐ (యం యల్ ) లిబరేషన్ పార్టీ జిల్లా నాయకుడు గాలి రవిరాజ్ ఆరోపించారు. సచివాలయాలలో వీఆర్వో లను నియమించడం లో కూడా అధికారులకు సమయం లేదని వారు నాయకులను విమర్శించారు.ఇప్పుడు అంగన్వాడీ ఆయాలు టీచర్ హెల్పర్ ల పోస్టులకు అప్లై చేసుకునేందుకు రెసిడెన్సీ సర్టిఫికెట్ లకు సంతకాల కోసం నానా అవస్థలు పడుతున్నారని వారన్నారు. అధికారులకు ఏమాత్రం చిత్తశుద్ధి వున్నా కనీసం ఇంచార్జిలను నియమించాలని వారు డిమాండ్ చేశారు.

## పల్లె పండుగ, అభివృద్ధి పనులు..



ఉమ్మడి అనంతపురం జిల్లా బ్యూరో "నరేంద్ర" (శుభోదయం న్యూస్ ): సత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గం తలుపుల మండలం దేశ ప్రధాని నరేంద్ర మోడీ పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా పంచాయతీల అభివృద్ధి పనులకు ఫండ్స్ రిలీజ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమం భాగంగా వేపమను పేట పెద్దన్నవారి పల్లి మరియు గుండువారి పల్లి గ్రామ పంచాయతీల నందు పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సిమెంట్ రోడ్ల ప్రారంభోత్సవం జరిగినది ఇందులో ఎంపీడీవో రామా నాయక్, ఉపాధి హామీ ఏపీవో ఎం హారున్ రషీద్, ఉపాధి హామీ సిబ్బంది ,గ్రామ సర్పంచ్,లోకల్ బాడీ సభ్యులు సచివాల సిబ్బంది.ఆ చుట్టుపక్క ప్రజలు పాల్గొన్నారు..

## పిల్లలతో కలుపుకొని డిస్లేక్స్య అవేర్నెస్ ప్రోగ్రాం ర్యాలీ




ఉమ్మడి అనంతపురం జిల్లా "నరేంద్ర" (శుభోదయం న్యూస్): తలుపుల మండలంలోనీ భవిత కేంద్రం లోని ఐఆర్పిలు మరియు ఉపాధ్యాయులు సి డబ్ల్యూ ఎస్ ఎన్ పిల్లలతో కలుపుకొని డిస్లేక్స్య అవేర్నెస్ ప్రోగ్రాం ను ర్యాలీగా నిర్వహించడం జరిగింది. ఇందులో డిస్లే ఎక్సియా అంటే ఏమిటి డిస్లెక్షియా గల పిల్లలను ఎలా గుర్తించాలి అందులోని లోపాలు గురించి మరియు ఆ లోపాలను ఎలా సరిచేసుకోవాలో వాటి గురించి ఎంఈఓ 1 వెంకట్ రాముడు మరియు ఎంఈఓ 2 విజయ్ కుమార్ అలాగే గవర్నమెంట్ హై స్కూల్ హెడ్మాస్టర్ శంకరప్ప వివరించడం జరిగింది. ఈ ప్రోగ్రాం ను ఎంఈఓ సార్ అయినా వెంకట రాముడు మరియు ఎంఈఓ 2 విజయ్ కుమార్ మరియు గవర్నమెంట్ హై స్కూల్ హెడ్మాస్టర్ శంకరప్ప ఇంకా ఐఆర్పీలు అయినా భారతి మరియు శ్రీనివాసులు ఇతరులు డిస్లెక్షియా ప్రోగ్రాం లో పాల్గొని విజయవంతం చేశారు.

## ప్రజలపై ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో విద్యుత్ బారాలు ఆపాలి: సిపిఎం



నంద్యాల, మండల రిపోర్టర్ - మోహన్ (శుభోదయం న్యూస్): భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్)




సి.పి.ఎం పార్టీ నంద్యాల కరెంట్ ఆఫీస్ ముందర ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో ప్రజల పైన విద్యుత్ భారలు ఆపాలని ఒక గంట పాటు ధర్నా చేసినా సిపిఎం నాయకులు. ధర్నా అనంతరం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.రమేష్ కుమార్, కార్యదర్శివర్గ సభ్యులు ఏ.నాగరాజు,సిపిఎం పార్టీ రాష్ట్ర నాయకులు ముజఫర్, పార్టీ పట్టణ సీనియర్ నాయకులు తోట మద్దులు, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు గౌస్, డి లక్ష్మణ్, వెంకటలింగం తదితరులు పాల్గొన్నారు.

## తుగ్గలి పోలీసు స్టేషన్ ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్



తుగ్గలి, మండల రిపోర్టర్ - మాధవ్ (శుభోదయం న్యూస్): తుగ్గలి, జొన్నగిరి, మద్దికేర పోలీసు స్టేషన్ ను కర్నూలు జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ శుక్రవారం వార్షిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్లో నమోదైన కేసుల్లో పెండింగ్ కేసులు వాటి స్థితిగతులు, నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తులు, వాటి పురోగతి పై కేసుల ఫైళ్ళను క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యమైన కేసులు, పాత గ్రేవ్ కేసులను సమీక్షించారు. ఎక్కువగా విజిబుల్ పోలీసింగ్ చేయాలని,



సమర్థవంతమైన నేర నియంత్రణ, నివారణ చర్యలు చేపట్టాలన్నారు. బాధితులు పోలీసుస్టేషన్ ను ఆశ్రయించినప్పుడు వారి సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. పోలీసు స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.సైబర్ నేరాల పై, మహిళ చట్టాల పై, నూతన చట్టాల పై ప్రతి గ్రామానికి వెళ్ళి ప్రజలకు అవగాహన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పత్తికొండ డిఎస్పీ వెంకట్రామయ్య , ట్రైనీ డిఎస్పీ ఉష శ్రీ, సిఐలు ప్రసాద్, గుణశేఖర్ బాబు, పులిశేఖర్, తుగ్గలి, జొన్నగిరి, మద్దికేర ఎస్ఐ లు పాల్గొన్నారు.

# గోదావరిఖని సప్తగిరి కాలనీలో రోడ్డు పనులు ప్రారంభం





గోదావరిఖని టౌన్, రిపోర్టర్ - సురేష్, (శుభోదయం న్యూస్): ఈ ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ మహంకాళి స్వామి కార్పొరేటర్ ఎండి ముస్తఫా బీసీ విభాగం అధ్యక్షులు రమేష్ పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ జూలకటకదారులు హాజరై కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు..అనంతరం కాలనీ వాసులు కాంగ్రెస్ పార్టీ శ్రేణులుడివిజన్ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముఖ్య అతిథులను శాలువాతో సన్మానించారు..ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఈరోజు గౌరవ రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ గారి ఆదేశాలతో డివిజన్లో అస్తవ్యస్తమైన రోడ్డు ను మరమతులకు చేయడానికి వారి స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ కింద దాదాపుగా 5 లక్షల రూపాయలతో ఈరోజు పనులను ప్రారంభించడం జరిగిందని,డివిజన్ ప్రజల పక్షాన మరియు కాంగ్రెస్ పార్టీ శ్రేణుల పక్షాన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ గారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని,ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ గారు అధికారం చేపట్టిన 8నెలల్లోనే రామగుండం పూర్వవైభవం కొరకు అహర్నిశలు కృషి చేస్తున్నారని అందులో భాగంగా రామగుండంలో సింగరేణి, జెన్కో సంస్థలు సంయుక్తంగా 800మెగా వాట్ల విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారని, మేడిపల్లి ఓసీపీలో 500మెగావాట్ల జల విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేయబోతున్నారని, తిలక్ నగర్లో నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాల కోసం స్కిల్ డెవలప్మెంట్ సెంటరును ప్రారంభించి మొదటి బ్యాచ్ లో దాదాపుగా 150మందిని ట్రైనింగుకు పంపించారని, రామగుండం అభివృద్ధికై దాదాపుగా 400కోట్ల రూపాయలు తీసుకొచ్చిన దమ్మున్న నాయకుడు ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ గారిని,ఇంకా అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయని,అదేవిధంగా డివిజన్ ప్రజల సమస్యల పరిష్కారానికి నిజాయితీతో, చిత్తశుద్ధితో, నిస్వార్థంగా కృషి చేస్తున్నానని, అతి త్వరలో మరిన్ని అభివృద్ధి పనులు ప్రారంభం అవుతాయని, తప్పకుండా డివిజన్ ప్రజల ఆకాంక్షకనుగుణంగా సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, 6వ డివిజన్ నాయకులు శీలం సదానందం, రమణ, రాజయ్య, గట్టయ్య, గుంపుల శ్రీధర్, సలిగంటి ఓదెలు, గోవర్ధన శాస్త్రి, మహిళ అధ్యక్షురాలు మాల్క అర్చన, ఇతర కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

## జొన్నగిరి, హుసేనాపురంలో సిసి రోడ్డుకు భూమి పూజ



తుగ్గలి, మండల రిపోర్టర్ - మాధవ్ (శుభోదయం న్యూస్): మండలం పరిధిలోని జొన్నగిరి, హుసేనాపురం గ్రామములో శుక్రవారం పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా ఏపిడి పక్కిరప్ప, మాజీ ఎంపీపీ గురుస్వామి,సర్పంచ్ ఓబులేసు, ఎంపీడీఓ విశ్వ మోహన్, ఈఓఆర్ డి శ్రీహరి,ఏపిఓ హేమ సుందర్, రోడ్డుకు భూమి పూజ చేయడం జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ మండల కమిటీ అధ్యక్షులు తిరుపాల్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు పల్లె పండుగ సందర్భంగా గ్రామాలలో అభివృద్ధి పనులు చేయడం హర్షించ తగ్గ విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటపతి,బాలన్న,విద్యా కమిటీ చైర్మన్ మిద్దె రవి,మిద్దె వెంకటేష్ , కృష్ణ, లక్షణ్ స్వామి, శేఖర్,లింగన్న, పక్కిరప్ప,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ గ్రామ సభలను సద్వినియోగం చేసుకోండి....




తుగ్గలి, మండల రిపోర్టర్ - మాధవ్ (శుభోదయం న్యూస్): మండలంలో జరుగుతున్న రెవెన్యూ గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసిల్దార్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోనే లింగనేని దొడ్డి గ్రామంలో రెవెన్యూ గ్రామ సదస్సు జరిగింది. ఈ సదస్సులో తహసిల్దార్ నాగరాజు మాట్లాడుతూ గతంలో జరిగిన రీ సర్వేలో ఏమైనా తప్పులు ఒప్పులు ఉంటే వాటిని సరి చేసేందుకు రైతుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే రైతులకు రీ సర్వే చేసిన రికార్డులను ఇవ్వడం జరిగిందన్నారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే అర్జీ రూపంలో ఇవ్వాలని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేలు సుధాకర్ ,వీఆర్వో వెంకట రాముడు, రైతులు పాల్గొన్నారు

## రాలిన వరి.. ఆశలు ఆవిరి



రెంటచింతల, మండల రిపోర్టర్- శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్) : వాయుగుండం దెబ్బకు గత మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో చేతికి వచ్చిన వరి పంట నేలరాలింది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో ఏర్పడిన తుఫాన్ రైతుల గుండెను అవిశిపోయేలా చేస్తోంది. ఇలాగే వర్షం కురిస్తే పంట పొలంలో ధాన్యం మొలకలు వస్తాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. రెంటచింతల మండలంలో వరి 5728 ఎకరాలు, పత్తి 4069 ఎకరాలు, మిరప 5621 ఎకరాల్లో సాగు జరుగుతోంది. ప్రస్తుతం మండలంలోని రెంటాల, మంచికల్లు, పాల్వాయి , రెంటచింతల గ్రామాల పరిధిలో వరి పంట పొలాలు వర్షం ధాటికి నేలకొరగడంతో అన్నదాతల ఆశలు ఆవిరి అవుతున్నాయి. వర్షం రోజూ కురుస్తుండడంతో రైతులను భయాందోళనకు గురిచేస్తోంది. వర్షాలు కురుస్తుండడం రైతుకు నష్టాన్ని కలిగించే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చెందుతున్నారు. ధాన్యంపై మొలకలు రావడం, గింజలు నల్లగా మారుతుందని గతంలో ఇదే పరిస్థితి ఉండేదని భయపడుతున్నారు. రెంటాల, మంచికల్లు, రెంటచింతల, పాల్వాయి తదితర ప్రాంతాల్లో కోత దశలో వరి ఉంది. మరో వారం రోజుల్లో కోత కోయాలనుకున్న రైతులు తుఫాన్ ప్రభావిత వర్షాలతో బెంబేలెత్తుతున్నారు. పొలాల్లోకి నీరు చేరడం, కుప్పలు కిందకు నీరు చేరడం చూసి భయపడుతున్న రైతులు ప్రస్తుతం తుఫాన్ నేపథ్యంలో ఉన్న పంటను కాపాడుకోవడానికి వ్యయ ప్రయాసలు పడుతున్నారు. వర్షాలు ధాటికి పత్తి పంటకు తెగుళ్ళు, మిరప పంట ఉరకెత్తే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. మండల పరిధిలోని రెంటచింతలలో వరి దాదాపు 800 ఎకరాల్లో, పాల్వాయిలో 1587 ఎకరాలు, రెంటాల 1276 ఎకరాల్లో, మంచికల్లులో 1218 ఎకరాల్లో, అలాగే పత్తి రెంటచింతలలో 717 ఎకరాల్లో, రెంటాల 282 ఎకరాలు, తుమృకోట 830 ఎకరాలు, మిట్టగుడిపాడు 684 ఎకరాలు, మల్లవరం 653 ఎకరాల్లో, జెట్టిపాలెం 409 ఎకరాల్లో కాగా మిరప రెంటచింతల 270 ఎకరాల్లో, మల్లవరం 614 ఎకరాల్లో, గోలి 539 ఎకరాల్లో, జెట్టిపాలెం 446 ఎకరాల్లో, పసర్లపాడు 771 ఎకరాల్లో, మిట్టగుడిపాడు 645 ఎకరాల్లో, తుమృకోట 1296 ఎకరాల్లో, రెంటాల 679 ఎకరాలు, పాల్వాయి 354 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేశారు.

## కోలహాలంగా పల్లె పండుగ కార్యక్రమాలు



వై పాలెం, నియోజకవర్గం రిపోర్టర్ - కాకర్ల కోటయ్య (శుభోదయం న్యూస్): రాష్ట్రంలో గ్రామాలను అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టిడిపి నాయకులు తెలిపారు. మండలకేంద్రమైన పుల్లల చెరువు,గంగవరం,రాచకొండ,నాయుడుపాలెం,పిడికిటివాని పల్లి,కవలకుంట్ల,చెన్నంపల్లి,కోమరోలు గ్రామాలలో పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ,కూటమి హయాంలో గ్రామాల్లో రోడ్లకు మహర్దశ పట్టిందన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా నెరవేరుస్తుందన్నారు.రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు,డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల కృషి మారువలేనిదన్నారు.పంచాయతీల అభివృద్దే ధ్యేయం గా వారు పనిచేస్తున్నారన్నారు. పల్లె పండుగ సందర్భంగా గ్రామాల్లో సిసి రోడ్లకు శంకుస్థాపనలు చేశారు.మండల కేంద్రమైన పుల్లల చెరువు లో బీసీ కాలనీలో రోడ్డుకు శంకుస్థాపన చేశారు.కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించారు.ఈ ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి కాకర్ల కోటయ్య, వయ్యావుల ప్రసాదు ఆయా గ్రామాల టిడిపి,జనసేన నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## బొల్లా నరసింహారావును సన్మానించిన ఎల్ ఎన్ పురం సచివాలయ సిబ్బంది



ప్రకాశం జిల్లా బ్యూరో - చంద్ర (శుభోదయం న్యూస్): కనిగిరి నియోజకవర్గం పామూరు మండలం లక్ష్మీ నరసాపురం ఎంపీటీసీ సభ్యులు టిడిపి యువ నాయకులు బొల్లా నరసింహారావును మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించిన ఎల్ ఎన్ పురం సచివాలయ సిబ్బంది. బి ఎన్ సి ని సన్మానించిన వారిలో పంచాయతీ సెక్రెటరీ వి మనోజ్, వెల్ఫేర్ సెక్రెటరీ పి మస్తాన్ రావు, డిజిటల్ అసిస్టెంట్ ఎస్.కె అజీజ్, వీఆర్వో ఏ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంఈఓ




దోమ,(శుభోదయం న్యూస్): దోమ మండలం మెట్టుగడ్డ తండా ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ వెంకట్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పాఠశాల తరగతి గదులను పరిసరాలను పలు రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థులను తెలుగు, ఇంగ్లీష్, గణితం కు సంబంధించిన పలు సమర్థ్యాలను విద్యార్థులతో చేయించి పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని మరింత చురుకుగా చదువుకునేలా విద్యార్థులను ఉపాధ్యాయులు అన్ని విధాలుగా ప్రోత్సహించి తీర్చిదిద్దాలని సూచించారు.

# హైదరాబాద్ ఇంటర్నేషనల్ జ్యువెలరీ షో ను ప్రారంభించిన....

## మంత్రి శ్రీధర్ బాబు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్




రామగుండం, మండలం రిపోర్టర్-తిరుపతి, (శుభోదయం న్యూస్) : హైదరాబాదులో హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ లోని హైదరాబాద్ ఇంటర్నేషనల్ జ్యువెలరీ షో ను మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి ప్రారంభించిన




రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాగూర్ మక్కాన్ సింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని వర్గాలకు అవసరమైన ఆర్నమెంట్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. విభిన్న నమూనాలతో సరసమైన రేట్లతో జువెలరీస్ సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. వినియోదారులకు అవసరమైన, విభిన్న నమూనాలు సెలెక్ట్ చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు.

# కాషాయికరణ విద్యా విధానంకై కేంద్రం కుట్రలను తిప్పి కొట్టాలి

## అర్థ శతాబ్ది జిల్లా సభలో పీడీ ఎస్ యు మాజీ నాయకులు ఐ. కృష్ణ




గోదావరిఖని టౌన్, రిపోర్టర్-సురేష్, (శుభోదయం న్యూస్): మూడోసారి కేంద్రంలో అధికారం లోకి వచ్చిన నరేంద్ర మోదీ సర్కార్ విద్యా విధానంలో కాషాయికరణని జొప్పించి, పర్యవసానంగా రాజ్యాంగాన్ని రద్దుచేసి,మను ధర్మ శాస్త్రాన్ని ప్రవేశపెట్టాలని కుట్రలకు తెర లేపుతున్నారని పూర్వ ప్రగతిశీల ప్రజాస్వామ్యం విద్యార్థి సంఘం పిడిఎస్ యు నాయకులు ఐ, కృష్ణ స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం గోదావరిఖని లోని ఐ ఎఫ్ టీ యు కార్యాలయంలో పిడిఎస్ యు అర్థ శతాబ్ది జిల్లా సభను నిర్వహించారు, ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన కృష్ణ మాట్లాడుతూ నేడు దేశంలో



కొనసాగుతున్న విద్య మనిషి నిజ జీవితంలో ఏమాత్రం ఉపయోగపడడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఉస్మానియాలో 1972లో జార్జిరెడ్డి స్థాపించిన పి.డి.ఎస్.యూ. గత 50 ఏళ్లుగా అలుపెరుగని పోరాటాలు చేస్తూ, విద్యార్థులకు అన్ని రకాలుగా అండగా నిలుస్తుందన్నారు. హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీల పెంపు కోసం, స్కాలర్ షిప్పుల విడుదల కోసం, ఐ.టి.ఐ. కాలేజీ, ప్రభుత్వ డిగ్రీ కాలేజీల సాధన కోసం పెద్ద ఎత్తున పోరాటాలు చేసిందన్నారు. తెలంగాణ ఉద్యమంలో పి.డి.ఎస్.యూ. ముఖ్య పాత్ర పోషించిందనీ, ఆ పోరాటాల్లో ఎన్నో అక్రమ కేసులను, నిర్బంధాలను అనుభవించిందన్నారు. అనేక మంది విద్యార్థి నాయకులు విలువైన ప్రాణాలు సైతం అర్పించారనీ, తన 50ఏళ్ల చరిత్రను గుర్తు చేసారు.ప్రస్తుత విద్యార్థి సంఘాలు ఆనాటి జాజిరెడ్డి అందించిన స్ఫూర్తితో ఈనాటి పాలక ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా విధానానికి వ్యతిరేకంగా పోరాడాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పీ డీ ఎస్ యు మాజీ నాయకులు కృష్ణస్వామి, సాలగామ మల్లేశ్, శ్రీనివాసరెడ్డి, ఈ నరేష్, బి అశోక్, ప్రస్తుత పి డి ఎస్ యు జిల్లా నాయకులు బడికెల ప్రసన్నకుమార్, వంశీ, సోయల్, సాయి కృష్ణ, రాజ్ కుమార్, రాకేష్, ప్రణీత్, స్థానిక నాయకులు బి ఆనంద్, ఎడ్ల రవికుమార్,ఎం దుర్గయ్య, జనగాం రాజన్న, కాంపెల్లి మల్లేష్. లతో పాటు ప్రస్తుత, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతుల సమ్మతితోనే రీ సర్వే ప్రక్రియ




రెంటచింతల, మండల రిపోర్టర్-శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్): గత వైకాపా ప్రభుత్వంలో రీ సర్వే చేసిన గ్రామాల్లోనే భూముల రీ సర్వే గ్రామ సభలు నిర్వహించేలా రెవెన్యూ యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు 18వ తేదీ నుంచి నిర్వహించే ఆయా గ్రామ సభల్లో రీ సర్వేలో నష్టపోయిన బాధిత రైతుల ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఫిర్యాదు పై పూర్తిస్థాయిలో విచారణ చేసి వాస్తవాలతో కూడిన సమాధానం రైతులకు ఇస్తారు. రైతు సంతృప్తి అంశాన్ని సైతం పరిగణనలోకి తీసుకుంటారు. ఈ నేపథ్యంలో మండలంలోని మిట్టగుడిపాడు గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో గురజాల ఆర్డీవో మురళి పాల్గొన్నారు. భూ యజమానులకు రీ సర్వేపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని రైతులను ఈ సందర్భంగా కోరారు. ఫిర్యాదులపై తక్షణమే పరిష్కరించేలా అధికారులను ఆదేశించామని ఆర్డీఓ తెలిపారు. గ్రామ సభలో 25 ఆర్జీలు రాగా వాటిని పరిగణనలోకి తీసుకొని చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆర్డీఓ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ నగేష్, ఆర్ ఐ పల్లా రామకృష్ణ, వీఆర్వో కాశయ్య తదితర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ బాపట్ల కార్యదర్శి అన్నదాత యజ్ఞ ప్రసాద్ కు.....

## బెంచ్ ప్రెస్ లో జాతీయ స్థాయి రజిత పతకం

### అభినందనలు తెలియజేసిన బాపట్ల జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు తాడివలస దేవరాజు




చీరాల, (శుభోదయం న్యూస్):బాపట్ల జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి అన్నదాత యజ్ఞప్రసాద్ జాతీయస్థాయి బెంచ్ ప్రెస్ పోటీలలో 157.5 కేజీల బరువు ఎత్తి రజిత పతకం సాధించారు. ఈ సందర్భంగా బాపట్ల జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు మరియు కామాక్షి కేర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఎండి తాడివలస దేవరాజు విజేతకు అభినందనలు తెలియజేశారు. ఈ నెల 14 నుండి 18 తేదీలలో గోవా రాష్ట్రం వాస్కో లోని రవీంద్ర భవన్లో పవర్ లిఫ్టింగ్ ఇండియా ఆధ్వర్యంలో 33వ జాతీయస్థాయి సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ మరియు మాస్టర్స్ మహిళల మరియు పురుషుల క్లాసిక్ అండ్ ఎక్యూప్డ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ -2024 నిర్వహించారు. ఐదు రోజులపాటు జరిగినటువంటి ఈ పోటీలలో చీరాల ప్రాంతానికి చెందిన అన్నదాత యజ్ఞ ప్రసాద్ మాస్టర్స్-2 విభాగంలో పురుషుల 93 కిలోల కేటగిరీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున పోటీపడి 157.5 కేజీల బరువును ఎత్తి రెండో స్థానంలో నిలిచి జాతీయస్థాయి రజిత పతకం సాధించారు. చీరాల పేరుని జాతీయ స్థాయిలో నిలబెట్టిన ఏ.వై ప్రసాద్ కు బాపట్ల జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ వైస్ చైర్మన్ పర్చూరు కుమారి నంద, అధ్యక్షులు చిన్న, అంబేశ్వర రెడ్డి, నాగేశ్వరరావు తదితరులు ఈ సందర్భంగా అభినందనలు తెలియజేస్తూ సంతోషం వ్యక్తం చేశారు.

# దివ్యాంగ జంటలకు వివాహాలు




ఒంగోలు, (శుభోదయం న్యూస్): ప్రవాస భారతీయులు వంకాయలపాటి సాంబశివరావు కవిత దంపతుల కుమార్తె వర్షిత 16వ జన్మదినోత్సవం సందర్భంగా కొమ్మి రమణయ్య- రాజేశ్వరి దంపతుల ఆధ్వర్యంలో సూర్య శ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు షేక్ సర్దార్ భాష- షహనాజ్ దంపతుల వద్ద ఆశ్రమం పొందుతున్న ఐదుగురు దివ్యాంగుల జంటలకు ఈరోజు ఒంగోలు ఎన్టీఆర్ కళాక్షేత్రం నందు వివాహం పెద్దల సమక్షంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వక్తులు మాట్లాడుతూ నిరుపేదలైన ఈ జంటలకు అన్ని తామై పెళ్ళికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు మిగతావారు లాగానే పూర్తి చేసి పెళ్లి ఘనంగా నిర్వహించి న వర్షిత కుటుంబ సభ్యులను అభినందించారు. వధూవరులు మాట్లాడుతూ మానవత్వంతో తమ బిడ్డలు లాగా మమ్మల్ని అక్కున చేర్చుకుని ఇంత ఘనంగా పెళ్లి చేసిన నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు .ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత్త మండవ మురళీకృష్ణ సవిత .మారెళ్ళ సుబ్బారావు రాజేశ్వరి దంపతులు. వంకాయలపాటి సత్యవతి. నూక తోటి శరత్ బాబు. మండవ సుబ్బారావు మంచినేని మాధవి. తమ్మిశెట్టి రమాదేవి కొమ్మి కృష్ణయ్య, వీరరాఘవులు తదితర పెద్దలు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా హెల్పింగ్ హాండ్స్ ప్రత్యేక డాక్యుమెంటరీని ప్రదర్శించారు. అందరికీ విందు భోజనం ఏర్పాటు చేశారు. వర్షిత పుట్టినరోజు పురస్కరించుకొని కుటుంబ సభ్యులు ఒంగోలు సంతపేటలోని శివం శరణాలయం నందు కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంగోలు నగరంలోని 300 మంది పేదలకు భోజన వసతి ఏర్పాటు చేశారు.

# విధి నిర్వహణలో మరణించిన హెూంగార్డు కుటుంబానికి ఆర్థిక సహాయం




నంద్యాల, మండల రిపోర్టర్ - మోహన్ (శుభోదయం న్యూస్): నంద్యాల జిల్లా నందు పనిచేస్తూ అనారోగ్య కారణాల చేత హెూంగార్డు 256 ఎస్.ఎం.డి హుస్సేన్ కు నంద్యాల కర్నూలు జిల్లాలకు చెందిన హెూంగార్డ్స్ అందరూ కలిసి వారి కుటుంబానికి చేయూతగా 2,00,000/- రూపాయల చెక్ ను హుస్సేన్ భార్య అయిన షేక్.షహీనకి నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ అధిరాజ్ సింగ్ రాణా చేతుల మీదుగా అందజేశారు.

# సమయపాలన పాటించని మండల పరిషత్ అధికారులు



కందుకూరు, అర్సీ ఇంచార్జ్ - శ్రీకాంత్ (శుభోదయం న్యూస్):వలేటివారిపాలెం మండల పరిషత్ కార్యాలయ అధికారుల తీరు మారడం లేదు. అధికారులు కార్యాలయానికి ఎప్పుడు వస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. సామాన్య ప్రజల సైతం అధికారుల తీరుపై మండిపడుతున్నారు. శుక్రవారం ఉదయం 11:20 నిమిషాలు సమయం దాటినప్పటికీ అధికారులు కార్యాలయానికి వచ్చిన పాపాన పోలేదు. ఒక్క టైపిస్ట్ మాత్రమే ఉన్నారు .దీంతో గంటలకొద్దీ అధికారుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఉన్నత స్థాయి అధికారులు కాస్త దృష్టి సారించి చర్యలు తీసుకోవాల్సిందిగా మండల ప్రజలు కోరుతున్నారు. వర్షాలతో గ్రామాల్లో నెలకొన్న పరిస్థితిని చెప్పుకుందామంటే ఏ ఒక్క అధికారి కూడా కనిపించని పరిస్థితి. ముక్యంగా గ్రామపంచాయతీలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలను పట్టించుకోవలసిన మండల పంచాయతీ అధికారి కూడా తెలియని పరిస్థితి ఏర్పడింది. శుక్రవారం మధ్యాహ్నం 11:20 నిమిషాలు వరకు కూడా ఏ అధికారి రాకపోవడంతో మండల ప్రజలు కార్యాలయ సిబ్బంది పై మండిపడుతున్నారు.

# శ్రీ చైతన్య టెక్నో విద్యార్థికి నేషనల్ మెడల్



సింగరాయకొండ, (శుభోదయం న్యూస్): సింగరాయకొండ శ్రీ చైతన్య టెక్నో విద్యార్థి నేషనల్ మెడల్ ను సాధించారు. గతవారం పాండిచ్చేరి రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరిగిన థర్డ్ ఫ్లోర్ కర్లింగ్




నేషనల్ ఛాంపియన్షిప్ 2024 పోటీలలో.. శ్రీ చైతన్య టెక్నో విద్యార్థి షేక్ అష్రాఫ్ కాంస్య పథకం కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా చిన్న వయసులో ప్రతిభ చాటిన అష్రాఫ్ ను ప్రిన్సిపాల్ లక్ష్మణ్ సూర్య రావు అభినందించారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్" డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారీయా శుభాకాంక్షలు తెలిపారు. తీర్చిదిద్దిన కోచ్ జాషువా ను అభినందించారు. విజేతగా నిలిచిన విద్యార్థికి ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు ప్రశంసించారు.

# బాల్యవివాహాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం : సింగరాయకొండ సిఐ హజరత్తయ్య




సింగరాయకొండ, (శుభోదయం న్యూస్): ఈరోజు ప్రపంచవ్యాప్త బాల్య వివాహాల నిరోధక దినోత్సవం సందర్భంగా సాంత్వనా సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సిఐ గారు మాట్లాడుతూ బాల్యవివాహాలు చేయడం వలన ఆడపిల్లల జీవితం మీద దారుణమైన ప్రభావం ఉంటుందని తెలిపారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే వెంటనే తెలియపరచాలని కోరారు. సంస్థ డైరెక్టర్ జయ కుమార్ మాట్లాడుతూ బాల్య వివాహం నేరం చట్ట ప్రకారం శిక బాల్య వివాహం చేసిన వారికి చేసుకున్న వారికి రెండు సంవత్సరాలు జైలు శిక్ష మరియు లక్ష రూపాయల వరకు జరిమానా విధించబడుతుంది తెలిపినారు. ఐసీడిఎస్ సూపర్వైజర్ రిజ్వానగారు మాట్లాడుతూ మీకు బాల్య వివాహాల వివరాలు తెలిసినట్లయితే వెంటనే మీ బాల్య వివాహాలు నిరోధక అధికారులను సంప్రదించండి అని తెలిపినారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది మరియు మహిళా కానిస్టేబుల్ పాల్గొన్నారు.

# జోరుగా బిజెపి సభ్యత్వ నమోదు



ధర్మవరం, నియోజకవర్గం ఇంచార్జ్ - గోవర్ధన రెడ్డి (శుభోదయం న్యూస్): శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలో బిజెపి సభ్యత్వ నమోదు జోరుగా నమోదు అవుతోందని బిజెపి నాయకులు పేర్కొన్నారు. బిజెపి చేపడుతున్న సభ్యత్వ నమోదును మంత్రివర్యులు సత్యకుమార్ యాదవ్ నాయకత్వంలో ధర్మవరం బిజెపి నాయకులు వార్డులలో ఇంటింటికి వెళ్తు సభ్యత్వన్ని నమోదు చేయిస్తున్నారు.శుక్రవారం పట్టణం లోని 1వ వార్డు,28 వ వార్డులలో సభ్యత్వం నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు సాకే ఓబిలేసు, జింకా చంద్రశేఖర్, గట్టు, నాగరాజు, పామిశెట్టి రమేష్,జింకా ప్రవీణ్, మంజునాథ్, మల్లికార్జున, రాజా ,మహేష్, నాగేంద్ర,అశోక్, రాజేంద్రనగర్ తదితరులు పాల్గొన్నారు.

# వరద బాధితుల సహాయార్థం రూ. 50 వేలు విరాళం అందించిన....

## బత్తలపల్లి వాసి ఎం. వెంకట కృష్ణ మంత్రి సత్య కుమార్



ధర్మవరం, నియోజకవర్గం ఇంచార్జ్ - గోవర్ధన్ రెడ్డి (శుభోదయం న్యూస్): విజయవాడ ప్రాంతంలో వరదల కారణంగా నష్టపోయిన ప్రజలను ఆదుకోవడానికి ధర్మవరం నియోజకవర్గంలోని బత్తలపల్లికి చెందిన విజ్ఞాన భారతి విద్యాలయ కరస్పాండెంట్ ఎం. వెంకట కృష్ణ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ. 50 వేలు విరాళం అందించారు. దీనికి సంబంధించిన చెక్కును శుక్రవారం విజయవాడలోని సెక్రటేరియట్ లో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్య కుమార్ యాదవ్ పేషీలో మంత్రికు అందజేశారు. వరదల కారణంగా ప్రజలు పడుతున్న కష్టాలను చూసినవెంకట కృష్ణ తమ ఆర్థిక సహాయం ద్వారా కష్టాల్లో ఉన్న ప్రజలకు నేరుగా సహాయం చేయాలని సంకల్పించారు. సాటి మానవులు ఆపదలో ఉండగా ఆదుకోవడం తన బాధ్యతగా భావించి తనవంతుగా సహాయం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ వరద బాధితులను ఆదుకోవడానికి సహాయం చేసిన వెంకట కృష్ణకు ధన్యవాదాలు తెలియజేశారు. ప్రతి ఒక్కరూ చేస్తున్న ఈ సహాయం, వరద బాధితుల కోసం అవసరమైన తక్షణ సహాయం అందించడంలో కీలక పాత్ర పోషించనుంది అని మంత్రి తెలిపారు.

## స్వర్ణకారులకు ఎన్ఫోర్స్మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు పట్ల హర్షం
## ధర్మవరం స్వర్ణకారుల వ్యాపారస్తుల సంఘం అధ్యక్షులు ఖలీల్



ధర్మవరం, నియోజకవర్గం ఇంచార్జ్ – గోవర్ధన్ రెడ్డి (శుభోదయం న్యూస్): ప్రభుత్వం స్వర్ణకారుల అభివృద్ధికి మరో శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్లో ఉన్నటువంటి స్వర్ణకారులకు ప్రత్యేకంగా ఎన్ఫోర్స్మెంట్ కార్పొరేషన్ ను ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికార పూర్వకంగా ప్రకటించారు. ఈ కార్పొరేషన్ స్వర్ణకారులకు ఎంతో ఉపయోగపడుతుందని ముఖ్యమంత్రి తెలిపారు. దీంతో ధర్మారంలో ఉండే స్వర్ణకారులు వ్యాపారస్తుల సంఘం అధ్యక్షులు ఖలీల్, ఉపాధ్యక్షులు ప్రకాష్ రావు, కార్యదర్శి మోక మురళి హర్షం వ్యక్తం చేస్తూ అంజుమాన్ సర్కిల్ వద్ద కేక్ కట్ చేసి, తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. అనంతరం సంఘం వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వర్ణకారులకు ప్రత్యేక ఎన్ఫోర్స్మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం నిజంగా శుభదాయకమని తెలిపారు. ఈ కార్పొరేషన్ వల్ల స్వర్ణకారులకు ముఖ్యమంత్రి అండగా ఉండడం, అభివృద్ధికి శ్రీకారం చుట్టడం పట్ల తాము సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నట్లు వారు తెలిపారు. భవిష్యత్తులో స్వర్ణకారులు అభివృద్ధి బాటలో నడుస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోవింద రాజులు, అనిల్ సేట్, సమీర్, షబ్బీర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ కు పోలేరమ్మ జాతర ఆహ్వానం



సైదాపురం, (శుభోదయం న్యూస్): నెల్లూరు జిల్లా సైదాపురం మండల పరిధిలోని ఈ నెల 22వ తేదీన అంగ రంగ వైభవం గా రెండు రోజుల పాటు పోలేరమ్మ జాతర ను కోలహాలంగా నిర్వహిస్తామని,జరగ బోయే జాతరకు రెవెన్యూ శాఖ తరపున సహాయ సహకారాలు అందించాలని మండల తహసీల్దార్ రమాదేవి కు జాతర కమిటి సభ్యులు వినతి పత్రం అందజేశారు.జాతర లో అమ్మవారి దర్శనకు వచ్చే పోయే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా రెవెన్యూ శాఖ తరుపున భద్రతా సిబ్బంది ను ఏర్పాట్లు చేయాలని జాతర కమిటీ సభ్యులు తహసీల్దార్ ను కోరారు.ఈ కార్యక్రమం లో పోలేరమ్మ జాతర కమిటీ సభ్యులు నెల్లూరు రమాదేవి,చింతా రామీ రెడ్డి,గురు ప్రసాద్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ చౌక ధాన్యపు
## స్టాక్ పాయింట్ ను పరిశీలించిన ఆర్డిఓ మహేష్




ధర్మవరం, నియోజకవర్గ ఇంచార్జ్ – గోవర్ధన్ రెడ్డి (శుభోదయం న్యూస్):పట్టణంలోని మార్కెట్ యార్డులోగా ప్రభుత్వ చౌక ధాన్యపు స్టాక్ పాయింట్ ను (ఎంఎల్ఎస్) ఆర్డిఓ మహేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోడౌన్లో ఉన్న స్టాకు రిజిస్టర్ లో ఉన్న స్టాక్ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, కరెక్టుగా ఉందని వారు తెలిపారు. అదేవిధంగా గోడౌన్లో ఉన్న బ్యాగులను కూడా తూకం వేసి పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీ నిర్వహించామని వారు తెలిపారు. ఎక్కడా ఎటువంటి పొరపాటు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అక్కడి అధికారులకు వారు సూచించారు. ఈ కార్యక్రమంలో సి ఎస్ డి టి లక్ష్మీదేవి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ధర్మవరం ప్రెస్ క్లబ్ కమిటీని రద్దు పరచాలి
### జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ (జాప్) ఆంధ్ర ప్రదేశ్ కమిటీ సభ్యులు
### పోలీసు ఉన్నతాధికారుల సమక్షంలో ప్రెస్ క్లబ్ కమిటీకి ఎన్నికలు నిర్వహించాలి



ధర్మవరం, నియోజకవర్గం ఇంచార్జ్ – గోవర్ధన్ రెడ్డి (శుభోదయం న్యూస్):శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం ప్రెస్ క్లబ్ కమిటీ విషయంలో ఏకపక్ష నిర్ణయాలు తీసుకొని ఏర్పాటు చేసుకున్న కమిటీని రద్దు పరచాలని, అదేవిధంగా పోలీస్ ఉన్నత అధికారి సమక్షంలో నూతన కమిటీని ఎంపిక చేయాలని అలాగే లెక్కలు పక్కాగా తేల్చాలని జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ (జాప్)ఆంధ్ర ప్రదేశ్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయ అధికారి ఏవో కుతిజెన్ కృప కు శుక్రవారం వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ధర్మవరంలో పాత్రికేయ కమిటీలు ఎన్ని ఉన్నా వర్కింగ్ జర్నలిస్టులు అందరూ కలిసిమెలిసి ఉండాలన్నదే మా భావన అని సూచించడం జరిగింది. ధర్మవరం ప్రెస్ క్లబ్ భవనం కొందరికే పరిమితం కాకుండా, ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా, పనిచేసే వర్కింగ్ జర్నలిస్టులు అందరూ కూడా ఆత్మీయ సోదర భావంతో కలిసిమెలిసి ఉండాలని కోరుకుంటున్నామని కమిటీ సభ్యులు తెలియజేశారు. ధర్మవరం రెవిన్యూ డివిజనల్ అధికారి తగు చర్యలు తీసుకుని పాత్రికేయులకు అందరికీ న్యాయం చేస్తారని కోరుతున్నాం.ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ (జాప్)ఆంధ్రప్రదేశ్ సత్య సాయి జిల్లా అధ్యక్షులు శ్రీ వైష్ణవ శ్రీనివాసులు, కార్యదర్శి మేకల నరసింహులు, వైస్ ప్రెసిడెంట్ దొడ్డప్ప, ఉపాధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి,బివిడి సంజయ్ కుమార్, బత్తిని మధుసూదన,పేరూరు రామాంజనేయులు, రాజు,తదితరులు పాల్గొన్నారు.

## మూడు కోట్లతో పల్లె పండుగ వారోత్సవాలు



ధర్మవరం నియోజకవర్గం ఇంచార్జ్ – గోవర్ధన్ రెడ్డి (శుభోదయం న్యూస్): ముదిగుబ్బ మండలంలోని అడవి బ్రాహ్మణపల్లి తాండ, మల్లేపల్లి, తప్పెట వారి పల్లి, ఒడ్డికింద తండా, కొండగట్టుపల్లి, మల్లేపల్లి, సానేవారిపల్లి, గ్రామాలలో ఎంపీపీ గొడ్డుమర్రి ఆదినారాయణ యాదవ్ ఆధ్వర్యంలో పల్లె పండుగ వారోత్సవాలు నిర్వహించారు మూడు కోట్లతో మండల వ్యాప్తంగా పల్లెల్లో పలు అభివృద్ధి పనులు సిసి రోడ్లు శంకుస్థాపన చేసి ప్రారంభించారు ఇనుములవారిపల్లి టిడిపి కార్యకర్త చిన్న గంగన్న గుండెపోటుతో మృతి చెందిన కుటుంబానికి పదివేల రూపాయలు ఆర్థిక సహాయం చేసిన ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ మినిస్టర్ సత్యకుమార్ ధర్మవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో చెప్పినట్లు నడిపిస్తున్నారని అన్నారు కార్యక్రమంలో ఎం.పీ.డీ.ఒ. విజయ్ భాస్కర్, ఏ. పీ. ఓ. రమణారెడ్డి ,టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ కృష్ణమూర్తి యాదవ్, గొడుగు అమీరు, గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సిఎమ్ఆర్ఎఫ్ చెక్కుల పంపిణి చేసిన కాంగ్రేస్ పార్టీ మండల అధ్యక్షుడు నారాగౌడ్




కామారెడ్డి, జిల్లా ప్రతినిధి – పోచయ్య (శుభోదయం న్యూస్ ): ఎల్లారెడ్డి నియోజకవర్గం ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆదేశానుసారంశుక్రవారం ఉదయం లింగంపేట్ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో లింగంపేట్ మండల అధ్యక్షుడు బుర్ర నారా గౌడ్ గారి చేతుల మీదుగా మండలంలో గల వివిధ గ్రామాలకు సంబంధించిన సిఎమ్ఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో లింగంపేట్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

## ఇంట్లో నుండి వెళ్లి శవమై కనిపించిన గంగజిపేట్ యువతి



పటాన్చెరు, (శుభోదయం న్యూస్): సంగారెడ్డి జిల్లా గంగోచిపేట గ్రామానికి చెందిన కాశపాగ మమత వయస్సు 24 సంవత్సరాలు ఇంట్లో నుండి పని కోసం సంగారెడ్డి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బుధవారం నాడు పొద్దుట సంగారెడ్డి వెళ్ళినారు బుధవారం సాయంత్రం ఆమె రాకపోవడంతో ఆమె కోసం ఇంటి వాళ్ళు ఎదురు చూసినారు ఆమె బుధవారం నాడు కూడా రాలేదు గురువారము కూడా ఆమె కోసం ఎదురుచూసి గురువారం నాడు కూడా రాలేదు ఆమెకు ఫోన్ చేసిన ఫోన్ స్విచ్ ఆఫ్ గా వస్తున్నది శుక్రవారం తెల్లవారుజామున 9 గంటలకు శివంపేట్ దగ్గర హెూన్న పురం శివారులో కాళ్లు చేతులు కట్టేసి పొదల్లో శవమై కనిపించినది. ఈ విషయం పోలీసులకు తెలవగానే పోలీసు వాళ్ళు వచ్చి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రాష్ట్ర ఐఎన్ టియుసి
## ప్రధాన కార్యదర్శి ఎరగాని నాగన్న గౌడ్ కు గౌరవ డాక్టరేట్
### సన్మానించిన ఉమ్మడి రాష్ట్రాల
### ఐఎన్టీయూసీ కార్యదర్శి పూసాల తిరుపతి




గోదావరిఖని టౌన్, రిపోర్టర్–సురేష్, (శుభోదయం న్యూస్) : హైదరాబాదులో ఇందిరా ఆర్ట్స్ ఫౌండేషన్ ఫ్రెండ్ షిప్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో కార్మికుల పక్షపాతి కార్మిక సమాజం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న గౌరవనీయులు రాష్ట్ర ఐ ఎన్ టి యు సి ప్రధాన కార్యదర్శి శ్రీ ఎరగాని నాగన్న గౌడ్ గారు డాక్టరేట్ అవార్డు అందుకున్న సందర్భంగా వారిని ఐ ఎన్ టి యు సి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సన్మానం కార్యక్రమంలో ఉమ్మడి రాష్ట్రాల ఎన్ టి యు సి కార్యదర్శి పూసాల తిరుపతి ఐ ఎన్ టి యు సి యూనియన్ నాయకులు ఈ సాయిబాబు ఎం లక్ష్మణ్ ఎం సుంకన్న మేడి తిరుపతి సిహెచ్ కుమారస్వామి అంజయ్య తదితరులు ఈ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వాహనదారులకి ప్రమాదాలపై అవగాహన సదస్సు నిర్వహించిన ఎస్సై సాంబయ్య



కందుకూరు, అర్సీ ఇంచార్జ్ – శ్రీకాంత్ (శుభోదయం న్యూస్):శుక్రవారం కందుకూరు పట్టణలోని ఎన్టీఆర్ విగ్రహం సమీపంలో పట్టణ ఎస్సై వి.సాంబయ్య వాహనదారులతో రోడ్డు ప్రమాదాలు మరియు వాటి నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. రోడ్డు ప్రమాదాలను ముఖ్యంగా యువత రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా మరణించడం మరియు అంగవైకల్యానికి గురికావడం జరుగుతుందని ఈ స్థితికి కారణం అజాగ్రత్త, నిర్లక్ష్యం ధోరణి ముఖ్య కారణమని కావున రోడ్డు ప్రయాణాలు చేసే సందర్భాలలో హెల్మెట్లు ధరించడం, వాహనాల్లో సీటు బెల్టు పెట్టుకోవడం, ఆటోలలో తక్కువ సంఖ్యలో ప్రయాణికులను ఎక్కించుకొని ప్రయాణం చేయడం, అతివేగాన్ని నిరోధించి మిత వేగంతో ప్రయాణించడం, వాహన తోలకదారులందరూ విధిగా డ్రైవింగ్ లైసెన్సులు పొందడం వాహనాలకు సరైనటువంటి ఇన్సూరెన్స్ డాక్యుమెంట్లను కలిగి ఉండడం చేయాలని సూచించడం జరిగినది. ఒక వ్యక్తి యొక్క నిర్లక్ష్యం ఆ వ్యక్తి యొక్క ప్రాణానికేక ఇతరుల ప్రాణాలుకు ముప్పు తీసుకొని వస్తుందని గ్రహించి అందరూ జాగ్రత్తగా వాహనాలు నడిపి వారి ప్రాణాలతో మరియు ఎదుటి వ్యక్తుల ప్రాణాలను కాపాడుకోవాలని సూచించడం జరిగినది. అట్లు కాక నిర్లక్ష్యం అజాగ్రత్తగాని వాహనాలు నడిపిన,మద్యం సేవించి వాహనాలు నడపిన ఎడల పోలీసు వ్యవస్థ, న్యాయస్థానాల ద్వారా జరిమానాలకు మరియు జైలు శిక్షకు బాధ్యులు కాగలరని హెచ్చరించడం జరిగింది.

## స్నేహలత నగర్ లో సిమెంట్ రోడ్లకు శంకుస్థాపన
### మంత్రి సవితమ్మకు కృతజ్ఞతలు తెలిపిన
### కాలనీ ప్రజలు మాజీ ఎంపీపీ వెంకటేశులు



శ్రీ సత్య సాయి జిల్లా బ్యూరో – పోతులయ్య (శుభోదయం న్యూస్): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందుతుంద నీ విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబునాయుడు అని టిడిపి నాయకులు మాజీ ఎంపీపీ వెంకటేశులు మండల కన్వీనర్ సిద్ధి లింగప్ప లు తెలిపారు. నియోజకవర్గంలోని పల్లెల ప్రగతికి బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ కృషి చేస్తున్నారని తెలిపారు. మంత్రి సబితమ్మ ఆదేశాల మేరకు శ్రీ సత్యసాయిజిల్లా సోమందేపల్లి మండల కేంద్రంలోని స్నేహలత నగర్ నందు మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం ద్వారా 27 లక్షల రూపాయల వ్యయంతో అభివృద్ధి పను లు చేపట్టారు. అందులో భాగంగా శుక్రవారం సిమెంట్ రోడ్లు డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు వంటి అభివృద్ధి పనులకు భూమి పూజ చేసి పనులను పంచాయతీరాజ్ వ్యవస్థ ద్వారా ప్రారంభించారు. ఈ అభివృద్ధి పనులను పంచాయతీరాజ్ డిఇ వెంకటరమణ మహాత్మ గాంధీ ఉపాధి హామీ పథకం ఏపీ డి శివానంద నాయక్, ఎంపీడీవో మమతాదేవి, పి



ఆర్ జె ఈ రవికుమార్, టిడిపి నాయకులు మాజీ ఎంపీపీ వెంకటేశులు టిడిపి మండల కన్వీనర్ సిద్ధి లింగప్ప లు భూమిపూజలో పాల్గొని పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా పి ఆర్ డి ఈ వెంకటరమణ మాట్లాడుతూ స్నేహలత కాలనీ నందు 27 లక్షల రూపాయలతో సిమెంట్ రోడ్లు డ్రైనేజ్ ఏర్పాటు పనులు చేపట్టడం జరుగు తోందని, ఇప్పటికే ఎనిమిది లక్షల రూపాయల వ్యయంతో సిసి రోడ్డు డ్రైనేజ్ పనులను ప్రారంభించడం జరిగిందని మిగిలిన పనులు త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు.మాజీ ఎంపీపీ వెంకటేశులు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి సీఎం చంద్రబాబు తోనే సాధ్యమని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అభివృద్ధి సంక్షేమం రెండుకళ్ళని తెలిపారు. పెనుగొండ నియోజకవర్గం అభివృద్ధికి మంత్రి సవితమ్మ అధిక నిధులను తీసుకువచ్చి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్నేలతనగరు కాలనీ ప్రజలు మాట్లాడుతూ గతంలో స్నేహలత నగర్ నందు రోడ్లు అద్వాన్నంగా ఉండడంతో బురదమయంగా కాలనీ మారడంతో అనేక ఇబ్బందులు పడ్డామని ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి పనులు చేపట్టడం ఎంతో సంతోషంగా ఉందని, మా కాలనీ అభివృద్ధికి కృషి చేస్తున్న మంత్రి సవితమ్మకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని తెలిపారు.

## బహ్రైచ్ నిందితులకు మరో షాక్ ఇచ్చిన సీఎం యోగి..



దుర్గా నిమజ్జనం వేళ ఉత్తర్ ప్రదేశ్ బహ్రైచ్లో మతఘర్షణలు చోటు చేసుకున్నాయి. ఈ ఘటనలో 22 ఏళ్ల రామ్ గోపాల్ మిశ్రా అనే యువకుడిని అత్యంత దారుణంగా కాల్చి చంపారు.ఈ ఘటనలో ప్రధాన సూత్రధారులు హమీద్తో పాటు అతని ఇద్దరు కుమారులు సర్ఫరాజ్, ఫహీమ్లను పోలీసులు అరెస్ట్ చేశారు. సర్ఫరాజ్, ఫకీమ్ నేపాల్కి పారిపోతున్న క్రమంలో సరిహద్దుల్లో ఎన్కౌంటర్ చేసి, నిందితులను గాయపరిచి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ హింసాకాండకు సంబంధించి మొత్తం 60 మంది వ్యక్తుల్ని యూపీ పోలీసులు అరెస్ట్ చేశారు.ఇదిలా ఉంటే, నిందితులకు సీఎం యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని ప్రభుత్వం మరో షాక్ ఇచ్చింది. ప్రధాన నిందితుడు అబ్దుల్ హమీద్ ఇళ్ల అక్రమ నిర్మాణం అంటూ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్మెంట్(పీడబ్ల్యూడీ) నోటీసులు జారీ చేసింది. యువకుడి మృతికి దారి తీసిన హింసాత్మక ఘటనలో పాల్గొన్నందుకు హమీద్తో పాటు నలుగురు ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు.అబ్దుల్ హమీద్ ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం నిర్మించారని ప్రభుత్వం పేర్కొంది. గ్రామీణ రహదారిని ఆక్రమించి నిర్మించిన ఇంటిని మూడు రోజుల్లో కూల్చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ భూముల నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు మధ్యలో 60 అడుగుల ఎత్తులో ఉన్న నిర్మాణాన్ని తొలగించాలని పీడబ్ల్యూడీ ఆదేశించింది.

## వారి విషయంలో కీలక నిర్ణయం తీసుకున్న తెలంగాణ గవర్నర్



**హైదరాబాద్, :** తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ కీలక నిర్ణయం తీసుకున్నారు. నిజామాబాద్‌లోని తెలంగాణ విశ్వవిద్యాలయం సహా వివిధ రాష్ట్ర విశ్వవిద్యాలయాలకు వైస్-ఛాన్సలర్ పోస్టుల నియామకాలకు ఆమోదం తెలిపారు. ఈ ఏడాది మే నెలలో రాష్ట్రంలో యూనివర్శిటీల వైస్ ఛాన్సలర్ల పదవీ కాలం ముగిసింది. దీంతో కొత్త వీసీల నియామకం కోసం ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది. ఇప్పుడు నియామకాలు జరిపింది. అందుకు సంబంధించిన పత్రికా ప్రకటన విడుదలైంది. పాలమూరు యూనివర్సిటీకి వైస్ ఛాన్సలర్‌గా జీఎన్ శ్రీనివాస్ వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగా ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీకి వైస్ ఛాన్సలర్‌గా కుమార్ మొగ్లారం కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీకి వైస్ ఛాన్సలర్‌గా ఉమేష్ కుమార్ హైదరాబాద్‌లోని తెలుగు యూనివర్సిటీకి వైస్ ఛాన్సలర్‌గా నిత్యానందరావు నల్గొండలోని మహాత్మాగాంధీ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్‌గా అల్తాఫ్ హుస్సేన్ -తెలంగాణ యూనివర్సిటీ, నిజామాబాద్ వైస్ ఛాన్సలర్‌గా యాదగిరిరావు హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్‌గా ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ హార్టికల్చరల్ యూనివర్సిటీకి వైస్ ఛాన్సలర్‌గా రాజి రెడ్డి వివిధ యూనివర్సిటీల నియామకాల ప్రక్రియను తమ ప్రభుత్వం వేగవంతం చేస్తుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగస్టులోనే ప్రకటించిన సంగతి తెలిసిందే. ఎట్టకేలకు నియామకాలు జరిగాయి.

## యుద్ధానికి దిగిన కిమ్‌జొంగ్- రష్యాకు వేలాది సైనికులు



రష్యా-ఉక్రెయిన్ మధ్య రోజుల తరబడి హెూరాహెూరీగా యుద్ధం కొనసాగుతోంది. 2022 ఫిబ్రవరి 24వ తేదీన ఆరంభమైన ఈ యుద్ధానికి అంతం అనేది ఉండట్లేదు. ఇన్ని రోజులుగా నిరాటంకంగా ఈ రెండు దేశాలు తలపడుతూనే వస్తోన్నాయి. నువ్వా-నేనా అన్నట్లు సాగుతున్న ఈ పోరులో ఉక్రెయిన్‌లోని పలు నగరాలు ధ్వంసం అయ్యాయి. వందలాదిమంది ప్రాణాలు కోల్పోయారు. అదే స్థాయిలో ఆస్తినష్టం సంభవించింది. అయినప్పటికీ ఏ దేశం కూడా వెనక్కి తగ్గట్లేదు. ఈ యుద్ధం వల్ల ఇప్పటికే ఉక్రెయిన్ తూర్పు ప్రాంతంలోని పలు నగరాలు నేలమట్టం అయ్యాయి. వాటిన్నింటినీ రష్యా సైనిక బలగాలు తమ ఆధీనంలోకి తెచ్చుకున్నాయి. మరియోపోల్, మెలిటొపోల్, క్రిమియా, డాన్‌బాస్, డొనెట్స్క్, లుహాన్స్క్, ఖేర్సన్, సుమి, ఒడెస్సా, చెర్నిహీవ్.. వంటి నగరాలను రష్యా సైనిక బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. పాశ్చాత్య దేశాల నుంచి ఎదురవుతోన్న ఒత్తిళ్లు, ఆంక్షలు, పలు రకాల నిషేధాలను కూడా రష్యా ధీటుగా ఎదుర్కొంటోంది. రష్యా సైన్యానికి ఉక్రెయిన్ అంత తేలిగ్గా తలవంచట్లేదు. ధీటుగా ఎదుర్కొంటోంది. కొన్ని సందర్భాల్లో పైచేయిని సాధించింది కూడా. రష్యా ఆధీనంలో ఉన్న కొన్ని కీలక నగరాలను విడిపించుకోగలిగింది. అమెరికా, ఫ్రాన్స్, బ్రిటన్, ఆస్ట్రేలియా సహా యూరోపియన్ యూనియన్ సభ్య దేశాలు అందిస్తోన్న ఆయుధాలు, యుద్ధ సామాగ్రితో రష్యా దూకుడుకు అడ్డుకట్ట వేయగలుగుతోంది. రాజధాని కీవ్‌ను స్వాధీనం చేసుకోవడానికి రష్యా సైన్యం చుట్టుముట్టినప్పటికీ..వారిని వెనక్కి పంపించగలిగింది. రోజులు గడుస్తున్నప్పటికీ ఉక్రెయిన్ అంత త్వరగా లొంగకపోవడం వల్ల రష్యా కీలక నిర్ణయాలను తీసుకుంది. ఈ యుద్ధంలో ఉత్తర కొరియా సహకారాన్ని తీసుకుంది. రష్యాకు మద్దతుగా 12,000 ట్రూప్‌లను ఉత్తర కొరియాకు రష్యాకు పంపించింది. ఈ విషయాన్ని దక్షిణ కొరియా ఇంటెలిజెన్స్ విభాగం వెల్లడించింది. ఉత్తర కొరియా పంపించిన ట్రూప్‌లో అత్యంత శక్తిమంతమైన స్పెషల్ ఆపరేషన్ ఫోర్సెస్ సైతం ఉన్నట్లు నిర్ధారించింది. ఈ మేరకు సియోల్ కేంద్రంగా పని చేస్తోన్న దక్షిణ కొరియా అధికారిక న్యూస్ ఏజెన్సీ యోన్‌హాప్ ప్రకటించింది. ఉత్తర కొరియాకు చెందని 1,500 యుద్ధనౌకలు ఇప్పటికే రష్యా పోర్ట్ సిటీ వ్లాదివోస్టోక్‌కు చేరినట్లు వెల్లడించింది. రష్యా మిలటరీ యూనిఫాం ధరించి కొరియా సైనికులు ఉక్రెయిన్‌పై పోరాడే అవకాశం ఉందని యోన్‌హాప్ అంచనా వేసింది. నార్త్ కొరియా నుంచి బయలుదేరిన సైనికులు రష్యాలోని ఉస్సురియాస్క్, ఖబరోవ్స్క్, బ్లగొవెన్షెన్స్క్ వంటి నగరాలకు చేరినట్లు నిర్ధారించింది కూడా. ఈ సమాచారం వెలుగులోకి వచ్చిన వెంటనే దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్.. అత్యవసర సమీక్షను నిర్వహించారు. ఉత్తర కొరియా వంటి దేశం రష్యాకు మద్దతుగా ఉక్రెయిన్‌పై యుద్ధానికి దిగడం అంతర్జాతీయ స్థాయిలో తీవ్ర ఆందోళనకరమని యూన్ సుక్ వ్యాఖ్యానించినట్లు యోన్‌హాప్ తెలిపింది. ఉత్తర కొరియా సైనిక బలగాలు ఇప్పటికే దేశం విడిచి వెళ్లిపోయాయని పేర్కొంది. మొదటి నుంచీ కూడా ఉక్రెయిన్‌కు నాటోలో సభ్యత్వాన్ని ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ వస్తోన్నారు ఉత్తర కొరియా అధినేత కిమ్‌జొంగ్ ఉన్. ఇదే విషయంపై ఆయన రష్యాకు మద్దతు పలికారు. ఎలాంటి సహకారాన్నయినా అందిస్తామంటూ గతంలోనే ప్రకటించారు. ఈ నేపథ్యంలో తాజాగా రష్యా నుంచి అందిన ప్రతిపాదనల మేరకు 12,000 ట్రూప్‌లను ఆ దేశానికి పంపించిందని దక్షిణ కొరియా పేర్కొంది.

## గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు గ్రీన్ సిగ్నల్: రిట్ పిటిషన్ కొట్టివేత




గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు వాయిదా వేయాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు శుక్రవారం కొట్టివేసింది. సింగిల్ బెంచ్ తీర్పును సమర్థించింది. దీంతో గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు లైన్ క్లియర్ అయింది. ఈ నెల 21 నుంచి 27 వరకు పరీక్షలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. గ్రూప్-1 పరీక్షలకు 31,383 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్రంలో 46 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.

### కోర్టుకు వెళ్లిన అభ్యర్థుల డిమాండ్ ఏంటి?

దివ్యాంగుల రిజర్వేషన్ కు సంబంధించి 2022లో జారీ చేసిన జీవో 55ను సవరణ తీసుకువస్తూ ఈ ఏడాది ఫిబ్రవరి 8న జారీ చేసిన జీవో 29ను రద్దు చేయాలని కొందరు గ్రూప్-1 అభ్యర్థులు ఆందోళనకు దిగారు. జనరల్ కేటగిరిలోని అభ్యర్థుల కంటే ఎక్కువ మార్కులు సాధించినవారిని అన్ రిజర్వ్ డ్ గా పరిగణించడంతో దివ్యాంగులకు అన్యాయం జరుగుతుందని వారి వాదన. జనరల్ అభ్యర్థుల కంటే ఎక్కువ మార్కులు వచ్చినా రిజర్వేషన్ కేటగిరిగానే పరిగణించి 1:50 కింద మెయిన్స్ కు పిలవాలనేది వారి డిమాండ్. దీన్ని దృష్టిలో ఉంచుకొని గ్రూప్-1 అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

### గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు సర్వం సిద్ధం

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. పరీక్ష కేంద్రాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. ఈ కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు ఆంక్షలు పెట్టారు.ఐదుగురికన్నా ఎక్కువ మంది గుమికూడవద్దని పోలీసులు హెచ్చరించారు.

## ఢిల్లీలో మళ్లీ పెరిగిన కాలుష్యం



న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం భారీగా పెరిగిపోయింది. దీపావళి పండుగకు ముందే గాలి నాణ్యత బాగా క్షీణించింది. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ తక్కువగా ఉన్నట్లు కాలుష్య నియంత్రణ మండలి తెలిపింది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ప్రకారం.. ఎన్‌సీఆర్‌లో ఘజియాబాద్‌లో 265, నోయిడాలో 243, గ్రేటర్ నోయిడాలో 228 సహా పలు ప్రాంతాల్లో గాలి నాణ్యత పూర్తిగా పడిపోయింది. ఇక, గాలి నాణ్యత 447కు పడిపోవడం అంటే దాన్ని తీవ్ర వాయు కాలుష్యంగా పరిగణించవచ్చు అని ఎయిర్ క్వాలిటీ అండ్ వెదర్ ఫోర్‌కాస్టింగ్ అండ్ రిసెర్చ్ నివేదికలో తేలింది. ఆనంద్ విహార్‌లో గాలిలో నాణ్యత 339, ద్వారకలో 325గా ఉంది. ఢిల్లీలో గాలి కాలుష్యం పెరిగిపోవడంతో దీపావళికి టపాసులపై ఢిల్లీ సర్కార్ నిషేధం విధించింది.

# ముదురుపాకాన దౌత్యయుద్ధం



ఖలిస్థానీ ఉగ్రవాది నిజ్జర్ హత్య కేసులో భారత దౌత్యాధికారులను 'పరిశీలించవలసి ఉన్న వ్యక్తుల జాబితా' లో కెనడా ప్రభుత్వం చేర్చడంతో అసలే అంతంత మాత్రంగా ఉన్న కెనడా- భారత్ సంబంధాలు మరింత క్షీణించాయి. కెనడా ప్రభుత్వ నిర్ణయంతో ఆగ్రహించిన భారత్.. ఆ దేశానికి చెందిన ఆరుగురు దౌత్యవేత్తలను దేశం విడిచి వెళ్లిపోవాలంటూ ఆదేశాలు జారీ చేయడంతోపాటు కెనడాలో ఉన్న భారత దౌత్యవేత్తలను వెనక్కి రప్పించాలని నిర్ణయం తీసుకుంది. బ్రిటిష్ కొలంబియాలోని ఒక గురుద్వారా వద్ద ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్‌ను గత ఏడాది గుర్తు తెలియని దుండగులు కాల్చిచంపారు. ఈ హత్యకు భారత ఏజెంట్లే కారణమంటూ కెనడా ప్రభుత్వం చేసిన ఆరోపణలు ఇరు దేశాల మధ్య అగ్గిరాజేశాయి. అది మొదలు కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో అడపాదడపా భారత ప్రభుత్వంపై నోరు పారేసుకుంటున్నారు. నిజ్జర్ హత్య కేసులో తమ ప్రమేయం ఉన్నట్లు ఆధారాలు అందించవలసిందిగా భారత ప్రభుత్వం చేసిన విజ్ఞప్తులను పెడచెవిన పెడుతూ వస్తున్న ట్రూడో, భారత్‌పై తన విమర్శలకు పదను పెడుతున్నారే తప్ప, పకడ్బందీగా దర్యాప్తు జరిపి నిజానిజాలను వెలికితీసే ప్రయత్నం చేయడం లేదు. ట్రూడో 2015లో ప్రధానిగా అధికార పగ్గాలు చేపట్టినప్పటి నుంచీ భారత ప్రభుత్వానికి వ్యతిరేక వైఖరినే అవలంబిస్తున్నారు. ఈ విషయంలో ఆయన తన తండ్రి, మాజీ ప్రధాని పిరే ట్రూడో అడుగుజాడల్లో నడుస్తున్నారు. 1985 లో ఎయిరిండియా విమానం కనిష్కను దారి మళ్లించి, లండన్‌లో దిగడానికి ముందు పేల్చివేసిన ఖలిస్థానీ ఉగ్రవాది పర్మార్‌ను పిరే ట్రూడో వెనకేసుకు వచ్చే ప్రయత్నం చేసి, ఇంటాబయటా అప్రదిష్టపాలయ్యారు. ఇప్పుడు ఆయన కుమారుడు జస్టిన్ ట్రూడో కూడా కెనడాలో తిష్ఠ వేసుకుకూర్చుని, భారత వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న ఖలిస్థానీ నేతలకు కొమ్ముకాస్తున్నారు. ఇందుకు కారణం లేకపోలేదు. భారతదేశానికి స్వాతంత్ర్యం రాకముందునుంచే సిక్కు సంతతి ప్రజలు కెనడాకు వలసవెళ్లడం మొదలైంది. 1970 దశకంలో అక్కడి వలస చట్టాలను సరళతరం చేయడంతో సిక్కుల వలసలు మరింత పెరిగాయి. అదే సమయంలో ఖలిస్థాన్ ఉద్యమంపై భారత ప్రభుత్వం ఉక్కుపాదం మోపడంతో అనేకమంది ఉగ్రవాద నేతలు కెనడాకు వలస వెళ్లిపోయారు. నిజ్జర్, పర్మార్ వంటి వారు ఆ కోవకే చెందినవారే. ప్రస్తుతం కెనడాలో ఏడున్నర లక్షల మందికి పైగా సిక్కులు నివసిస్తున్నారు. అక్కడి ఓటు బ్యాంకు రాజకీయాలపై సిక్కుల ప్రభావం ఎంతో ఎక్కువ. దీంతో అధికారంలోకి ఎవరు వచ్చినా సిక్కుల మద్దతుకోసం వెంపర్లాడటం పరిపాటిగా మారింది. ప్రస్తుతం అధికారంలో ఉన్న లిబరల్ పార్టీ మంత్రివర్గంలో నలుగురు సిక్కులు ఉన్నారంటే సిక్కులకు ట్రూడో ప్రభుత్వం ఎంత ప్రాముఖ్యతనిస్తోందో అర్థం చేసుకోవచ్చు. సిక్కుల ఓటు బ్యాంకును సొంతం చేసుకునేందుకు ట్రూడో చేయవలసిందంతా చేస్తున్నారు. ఖలిస్థానీ ఉగ్రవాదుల కొమ్ము కాస్తూ, వారు అక్కడి హిందువులపైనా, హిందూ దేవాలయాలపైనా దాడులకు పాల్పడుతున్నా పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అంతేకాదు, భారత్‌ను వేధించేందుకు విదేశీ విద్యార్థులకు ఇచ్చే స్టడీ పర్మిట్లపైనా కెనడా కోత విధిస్తోంది. అమెరికా తరువాత భారతీయ విద్యార్థుల సంఖ్య కెనడాలోనే ఎక్కువ. గత పదేళ్లలో కెనడాలో భారతీయ విద్యార్థుల సంఖ్య ఏకంగా 260 శాతం పెరిగిన విషయం ఈ సందర్భంగా గమనార్హం. కెనడాలో వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ట్రూడో నాయకత్వంలోని లిబరల్ ప్రభుత్వం వెనుకంజలో ఉన్నట్లు తాజా సర్వేలు చెబుతున్నాయి. దీంతో దిద్దుబాటు చర్యలకు దిగిన ట్రూడో, భారత్‌పై వేధింపు చర్యలకు పాల్పడుతూ, సిక్కు ఓట్లు కొల్లగొట్టేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. భారత దౌత్యాధికారులను నిజ్జర్ హత్య కేసులో ఇరికించేందుకు పూనుకోవడం ఇందులో భాగమే. తమ దేశంలోని ఖలిస్థానీ వేర్పాటువాదులను భారత ఏజెంట్లు లక్ష్యంగా చేసుకున్నారని, బిష్ణోయ్ గ్యాంగ్ సహకారంతో వారిని తుదముట్టించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీసులు తాజాగా ఆరోపించినా, అందుకు తగిన ఆధారాలను మాత్రం చూపించకపోవడం ప్రభుత్వం ఒంటెత్తు పోకడలకు నిదర్శనం. కెనడాలో స్థిరనివాసం ఏర్పరచుకుని భారత్‌లో ఉగ్రవాద కార్యకలాపాలను ఎగదోస్తున్న ఖలిస్థానీ ఉగ్రవాదులను అప్పగించాలంటూ భారత ప్రభుత్వం పదేపదే చేస్తున్న విజ్ఞప్తులను పెడచెవిన పెడుతూ, ఒక ప్రణాళిక ప్రకారం భారత్‌పై విషం కక్కుతున్న ట్రూడో వైఖరి గర్హనీయం.

# ఇది గిరిజనుల విజ్ఞతకు పరీక్ష



ఖనిజ సంపదకు నెలవైన గిరిజన జార?ండ్ అసెంబ్లీ ఎన్నికల సంగ్రామం ఈసారి హెూరాహెూరీగా ఉండే పరిస్థితి ఏర్పడింది. గతంలో ఒకసారి ఎదురైన పరాజయంతో బిజెపి ఈసారి ఎలాగైనా జార?ండ్ కోటపై జెండా ఎగురవేయాలన్న గట్టి పట్టుదలతో ఉంది. మరోవైపు అధికారంలో ఉన్న జార?ండ్ ముక్తి మోర్చా కాంగ్రెస్ కూటమి ఆదివాసీల హక్కులను పరిరక్షించుకోవడమే కాక, ప్రాంతీయ స్వయం ప్రతిపత్తిని నిలబెట్టుకోవాలని ఆకాంక్షిస్తోంది. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 81 స్థానాల్లో 72 చోట్ల బిజెపి పోటీ చేసి 37 స్థానాలను దక్కించుకోగలిగింది. మిత్రపక్షం ఆల్ జార?ండ్ స్టూడెంట్స్ యూనియన్ (ఎజెఎస్‌యు) దక్కించుకున్న ఐదు స్థానాలను కలుపుకుని మెజార్టీ మార్కుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగింది. కానీ స్వయంకృతాపరాధాలతో నిలదొక్కుకోలేక 2019లో పరాజయం పాలైంది. 2015 2020 మధ్య గిరిజనేతర నాయకత్వంతో దెబ్బతిన్న బిజెపి ఈసారి స్థానిక వర్గాలతో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఎజెఎస్‌యుతో మిత్రత్వం పెంపొందించుకుని గిరిజన తెగల్లో ప్రధానమైన కుర్మీ ఓట్లను కొల్లగొట్టడానికి పావులు కదుపుతోంది. జార?ండ్‌లో కుర్మీ, సంథాల్ పరగణా గిరిజన తెగల ప్రభావం ఎక్కువ. వీరి ఓట్లే విజయం నిర్ణయించడంలో కీలక పాత్ర వహిస్తాయి. సంథాల్ పరగణా రీజియన్‌లో 18 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఈ రీజియన్‌లో మొదటి నుంచి జెఎంఎంకు గట్టిపట్టుంది. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ రీజియన్‌లో జెఎంఎం 9 స్థానాలు, కాంగ్రెస్ 5, బిజెపి 4 స్థానాలు దక్కించుకున్నాయి. అయితే ఇక్కడ బలమైన కుర్మీలు ప్రస్తుతం వెనుకబడిన వర్గాల జాబితాలోనే ఉన్నారు. తమను షెడ్యూల్డ్ తెగల జాబితాలో చేర్చాలని గత కొన్నేళ్లుగా వీరు డిమాండ్ చేస్తున్నారు.



2004, 2015లో అప్పటి జార?ండ్ ప్రభుత్వాలు కుర్మీలను షెడ్యూల్డ్ తెగగా గుర్తించాలని కేంద్రానికి సిఫార్సు చేసినా, కేంద్రం వ్యతిరేకించింది. ఈసారి బిజెపికి ఇది ప్రధాన సమస్య కానుంది. అవినీతి కేసులో ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ కొన్నాళ్లు జైలు జీవితం గడిపినా, ఆ ప్రభావం రాష్ట్రంలో కనిపించడం లేదు. గిరిజన వర్గాల్లో సోరెన్‌కు ఉన్న పలుకుబడి తగ్గలేదు. అక్రమ ఆస్తుల కేసులో హేమంత్ అరెస్ట్ వ్యవహారం చూపించి, గిరిజనుల ఆత్మగౌరవ అంశాన్ని ఈ ఎన్నికల్లో బలంగా లేవనెత్తాలని జెఎంఎం ప్రయత్నిస్తోంది. సంథాల్ పరగణా లాంటి గిరిజన మారుమూల ప్రాంతాల్లో తమకు ఢోకా లేకున్నా పట్టణ ప్రాంతాల్లో బిజెపిని గట్టిగా ఢీకొట్టేందుకు కాంగ్రెస్ సహాయం తనకు ఉపయోగపడుతుందని జెఎంఎం నాయకత్వం విశ్వసిస్తోంది. అయితే రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రి అయిన గిరిజన నాయకుడు బాబూలాల్ మరాండీ ప్రతిపక్ష నేతగా బిజెపికి గట్టి మద్దతు ఇస్తుండడం బిజెపికి కలిసివచ్చిన అంశం. జార?ండ్ ఆదివాసీల, బలహీన వర్గాల ఉనికిని, హక్కులను రక్షించుకోవడమే తమ ప్రధాన లక్ష్యంగా జెఎం ఎం ప్రచారం సాగిస్తోంది. ఇదే ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ రాజకీయ సిద్ధాంత పునాదిగా ఉంటోంది. బిజెపి హిందుత్వ, కార్పొరేట్ అనుకూల విధానాలను ఎండగడుతున్నారు. మహిళా ఓటర్లను ఆకట్టుకోడానికి మయ్యా సమ్మాన్ యాత్ర ప్రారంభించారు. మయ్యా సమ్మాన్ యోజన పథకం కింద 18 నుంచి 50 ఏళ్ల మహిళలకు నెలకు రూ. 1000 నగదు పంపిణీ అవుతుందని స్పష్టం చేశారు. 2021 జనాభా లెక్కల్లో సర్నా అనే ప్రత్యేక గిరిజన మతస్థులను చేర్చడానికి వీలుగా సర్నాకోడ్‌పై 2020లో అప్పటి జార?ండ్ ముక్తిమోర్చా ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానించి కేంద్రానికి పంపించినట్టు గుర్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా బిజెపి తన 'పంచ్‌ప్రాణ్ ' పేరిట వాగ్దానాలు చేసి సంక్షేమ పథకాల ప్రచారం సాగిస్తోంది. జెఎంఎం ప్రభుత్వం ఎంతవరకు తన హామీలను నెరవేర్చిందో చెప్పాలని ఓటర్లను 'మిలా క్యా' (హామీలు ఏమైనా నెరవేరాయా) అని ప్రశ్నిస్తోంది. రాష్ట్ర ఖనిజ సంపద సమర్ధ నిర్వహణ, సంరక్షణ, రాయితీల పంపిణీ, ఆర్థికాభివృద్ధి తమ ప్రధాన లక్షాలుగా చెబుతోంది. జెఎంఎం నేతృత్వంలోని ఖనిజ వనరుల అజమాయిషీ అస్తవ్యస్తంగా సాగుతోందని, తాము అధికారంలోకి వస్తే కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం డబుల్ ఇంజిన్‌గా పని చేసి అభివృద్ధిని చూపిస్తామని బిజెపి చెబుతోంది. అయితే రాష్ట్రానికి అక్రమ వలసలు తీవ్ర సమస్యగా తయారైంది. ఈ విషయంలో జెఎంఎం ఘోరంగా విఫలమైందని బిజెపి ధ్వజమెత్తుతోంది. దీనికి తోడు యువకులకు ఉద్యోగాల కల్పనలో వెనుకబాటుతనం, అవినీతిని నివారించలేకపోవడం ఇవన్నీ జెఎంఎం లోపాలుగా కనిపిస్తున్నాయి. జార?ండ్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు నవంబర్ 13, 20 తేదీల్లో జరుగుతాయి. నవంబర్ 23న వెలువడనున్న ఫలితాల్లో ఓటర్లు మళ్లీ ఇదే ప్రభుత్వాన్ని గెలిపిస్తారో లేదా మార్పును కోరుకుంటున్నారో గిరిజనుల విజ్ఞతకే ఇది పరీక్షగా మారింది.

# ప్రమాదకర ప్రతిపాదన



విజ్ఞత మరిచినచోట విపరీతాలు చోటుచేసుకోవటంలో వింతేమీ లేదు. కావడ్ యాత్ర సందర్భంగా జారీచేసిన ప్రభుత్వ ఉత్తర్వులను నిలిపివేస్తూ సర్వోన్నత న్యాయస్థానం మొన్న జూలైలో ఇచ్చిన తీర్పు అర్థం కాకనో లేక దాన్ని ధిక్కరించే ఉద్దేశమో... ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం రెండు ఆర్డినెన్సులు తీసుకురావాలని తాజాగా నిర్ణయించింది. ఆహారంలో లేదా పానీయాల్లో ఉమ్మివేయటం లేదా మానవ వ్యర్థాలతో దాన్ని కలుషితపరచటం పదేళ్ల శిక్షకు అర్హమయ్యే నాన్ బెయిలబుల్ నేరంగా పరిగణించటం, విక్రయదారుల పూర్తి వివరాలు అందరికీ కనబడేలా చేయటం ఈ ఆర్డినెన్సుల ఉద్దేశం. ఇప్పుడున్న చట్టం ప్రకారం కల్తీ కారణంగా మరణం సంభవిస్తే బాధ్యులైనవారికి మూడేళ్ల కఠిన శిక్ష విధించవచ్చు. తినే ఆహారపదార్థం రుచిగా, పరిశుభ్రంగా ఉండాలని ప్రతి ఒక్కరూ కోరు కుంటారు. అలాంటి ఆహారం దొరికేచోటకే వెళ్తారు. హెూటళ్లు మొదలుకొని సైకిళ్లపై తిరుగుతూ అమ్ముకునే విక్రయదారుల వరకూ అందరూ కమ్మనైన ఆహారపదార్థాలు వడ్డించి వినియోగదారులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తారు. ఒకవేళ ఎవరైనా లాభార్జనకు కక్కుర్తిపడి నాసిరకం పదార్థాలను అంటగడితే అలాంటివారి పనిబట్టడానికి రకరకాల చట్టాలున్నాయి. ఆహారకల్తీని అరికట్ట డానికీ, హానికరమైన, కాలంచెల్లిన పదార్థాల విక్రయాన్ని నిరోధించటానికీ హెూటళ్లపై, ఇతర దుకాణాలపై విజిలెన్సు విభాగాలు దాడులు నిర్వహిస్తుంటాయి. కేసులు పెడతాయి. అయితే ఇదంతా ఒక క్రమపద్ధతిలో జరగటం లేదని, ప్రభుత్వాలు మొక్కుబడిగా ఈ పనిచేస్తుంటాయన్న విమర్శలు కూడా ఉన్నాయి. ఆహారం తిని అస్వస్థతకు గురయి పదుల సంఖ్యలో జనం ఆస్పత్రుల పాలైనప్పుడు ఆదరాబాదరాగా చర్యలు తీసుకోవటం కూడా కనబడుతుంటుంది. హఠాత్తుగా యూపీ సర్కారు ఈ చర్య తీసుకోవటం వెనక ఇలాంటి ఘటన ప్రభావం ఏమైనా ఉందా? పోనీ ఈ మాదిరి ఉదంతాల కారణంగా జనం తరచూ అస్వస్థులవుతున్న లేదా మరణిస్తున్న ఉదంతాలేమైనా గమనించారా? అసలు ఉత్తరప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ అధికారంలోకొచ్చాక ఎన్ని హెూటళ్లపై, తినుబండారాల విక్రయ సంస్థలపై దాడులు నిర్వహించారు? అక్రమాలకు పాల్పడ్డారని తేలిన ఎంతమందిని శిక్షించారు? ఈ క్రమంలో ప్రస్తుత చట్టాలు నిరుపయోగంగా ఉన్నాయని భావిస్తే తగిన డేటాతో ఆ వివరాలు ప్రజల ముందు ఉంచొచ్చు. అప్పుడు ఒక సమగ్రమైన చట్టం అవసరమేనని అందరూ భావిస్తారు. కానీ యూపీలో జరుగుతున్నది అది కాదు. ఫలానా వర్గంవారు విక్రయించే పండ్లు లేదా ఇతర ఆహారపదార్థాలు అపరిశుభ్రంగా ఉంటాయని, వాటిని కలుషితం చేసి అమ్ముతున్నారని ఆరోపిస్తూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం సాగుతోంది. వాటి ఆధారంగా ప్రభుత్వం ఈ ఆర్డినెన్సులు తీసుకొస్తున్నట్టు కనబడుతోంది. దుశ్చర్యలకు పాల్పడేవారికి మతం, కులం ఉండవు. ఎక్కడో ఒకచోట జరిగిన ఘటనను వీడియో తీసి ఫలానా మతం వారంతా ఇలాగే చేస్తున్నారని వదంతులు వ్యాప్తిచేయటం విద్వేషాలు రెచ్చగొట్టడానికే తోడ్పడతాయి. ఇదే యూపీలోని ఘాజియాబాద్‌లో ఒక వ్యాపారి ఇంట్లో ఎనిమి దేళ్లుగా వంట మనిషిగా పనిచేస్తున్న రీనా కుమార్ అనే యువతి రోటీల్లో మూత్రాన్ని కలుపుతోందని ఆరోపిస్తూ పోలీసులు బుధవారం అరెస్టు చేశారని మీడియా కథనాలు వెల్లడించాయి. ఆ మధ్య తెలంగాణలో అధికారులు వరస దాడులు నిర్వహించినప్పుడు అనేక హెూటళ్లు, తినుబండారాల దుకాణాలు పాచిపోయిన పదార్థాలను అమ్ముతున్నాయని తేలింది. ఇలాంటి నేరాలకు పాల్పడిన వారిలో అన్ని మతాలకూ చెందినవారూ ఉన్నారు. ఉత్తరాది రాష్ట్రాల్లో ఘనంగా జరిగే కావడ్ యాత్ర సమయంలో ఆ మార్గంలోని దుకాణాల్లో విక్రయదారులు తమ పేర్లు, ఇతర వివరాలు కనబడే బోర్డులు ప్రదర్శించాలని పోలీసులు మొన్న జూలైలో నోటీసులిచ్చారు. కావడ్ యాత్రికులు 'స్వచ్ఛమైన శాకాహారులు' గనుక అపశ్రుతులు చోటుచేసుకోకుండా ఈ పని చేశామని సంజాయిషీ ఇచ్చారు. దాన్ని సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. దుకాణంలో నచ్చిన, నాణ్యమైన, రుచికరమైన ఆహారం దొరుకుతున్నదో లేదో వినియోగదారులు చూస్తారు తప్ప, వాటి విక్రయదారు ఎవరన్నది పట్టించుకోరు. అలా పట్టించుకోవాలని యూపీ ప్రభుత్వం తహతహలాడుతున్నదని తాజా నిర్వాకం గమనిస్తే అర్థమవుతుంది. వినియోగదారుల విశ్వాసాన్ని పరిరక్షించటమే ఆర్డినెన్సుల ఉద్దేశమన్న ప్రభుత్వ వాదన నమ్మదగ్గదిగా లేదు. ఆ పని విక్రయదారులది! వారిలో అక్రమార్కులుంటే చర్య తీసుకోవటానికి ఇప్పుడున్న చట్టాలు సరిపోతాయి. చెదురుమదురుగా జరిగిన ఉదంతాలను భూతద్దంలో చూపి జనాన్ని కలవరపెట్టడం సబబు కాదు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు వెనకున్న స్ఫూర్తి అర్థం చేసుకుంటే యూపీ ప్రభుత్వం ఇలాంటి ఆర్డినెన్సుల ఆలోచన చేసేది కాదు. యూపీలో గోసంరక్షణ, లవ్ జీహాద్ తదితర ఆరోపణలతో గుంపు దాడులు, గృహదహనాలు, హత్యోదంతాల వంటివి జరిగాయి. నిందితుల ఇళ్లూ, దుకాణాలూ బుల్‌డోజర్లతో నేలమట్టం చేయటం కూడా రివాజుగా మారింది. ఎన్‌కౌంటర్లు సరేసరి. ఆర్డినెన్సుల ప్రతిపాదన ఆ క్రమంలో మరో చర్య కావొచ్చన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉపాధి కరువైందని యువత... ధరలు ఆకాశాన్నంటాయని సామాన్యులు మొత్తుకుంటున్నారు. విద్య, వైద్య రంగాలు పడకేశాయని గగ్గోలు పెడుతున్నారు. వీటిపై సమర్థవంతంగా వ్యవహరించి ప్రజల విశ్వా సాన్ని పొందాల్సివుండగా, ప్రజల్లో పరస్పర అవిశ్వాసాన్ని కలిగించే ఇలాంటి పనులకు పూను కోవటం ఏం న్యాయం? అసలు నేరానికి తగ్గ శిక్ష ఉండాలన్న ఇంగితం కరువైతే ఎలా? ఆర్డినెన్సుల ప్రతిపాదనపై యూపీ సర్కారు పునరాలోచన చేయాలి.

## సందడి చేస్తున్న ఒపీనియన్ పోల్స్..గెలుపు ఎవరిదంటే..?



అమెరికా అధ్యక్ష ఎన్నికలు నవంబర్ 5న జరగనున్నాయి. డెమొక్రాటిక్ పార్టీ నుంచి అధ్యక్ష అభ్యర్థిగా కమలా హారిస్ బరిలో ఉండగా... డొనాల్డ్ ట్రంప్ రిపబ్లిక్ పార్టీ నుంచి పోటీలో ఉన్నారు. ఇక ఎన్నికల ప్రచారాన్ని ఇరు అభ్యర్థులు హోరెత్తిస్తున్నారు. అక్కడి ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు హామీల వర్షం కురిపిస్తున్నారు. ఈ క్రమంలోనే ఒపీనియన్ పోల్స్ సందడి చేస్తున్నాయి. ఇంతకీ ఒపీనియన్ పోల్స్ ఎవరు గెలుస్తారని జోస్యం చెబుతున్నాయి.. అమెరికా అధ్యక్ష ఎన్నికలకు ముందు ఒపీనియన్ పోల్స్ సందడి చేస్తున్నాయి.బెట్టింగ్ మార్కెట్స్ ట్రంప్ అధికారం చేపడతారని కోడై కూస్తున్నాయి. పాలీ మార్కెట్ అనే సంస్థ వెలువడించిన ఒపీనియన్ పోల్స్ ప్రకారం అమెరికా అధ్యక్ష పీఠం ట్రంప్‌నే వరిస్తుందని పేర్కొంది. జో బైడెన్ అధ్యక్ష ఎన్నికల రేసు నుంచి తప్పుకున్నప్పటి నుంచి ట్రంప్‌కు కలిసొచ్చిందని వివరించాయి. ట్రంప్‌కు అధ్యక్షుడయ్యే అవకాశాలు 60శాతం మేరా మెరుగయ్యాయని పేర్కొంది.ఇంకా అర్థమయ్యేలా చెప్పాలంటే ప్రతి 100 ఓట్లలో 60 ఓట్లు ట్రంప్‌కే వస్తాయని ఒపీనియన్ పోల్స్ జోస్యం చెప్పాయి. ట్రంప్ విజం సాధిస్తారని పలు మార్కెట్లు కూడా అభిప్రాయపడుతున్నాయి. ఉదాహరణకు బెట్‌ఫెయిర్ అనే సంస్థ ట్రంప్ గెలుపు అవకాశాలు 58శాతం ఉన్నాయని అంచనా వేస్తుండగా.. కల్షి పెగ్స్ 57శాతం,ప్రెడిక్టిక్ 54శాతం స్మార్కెట్స్ 58శాతం అంచనా వేశాయి.జూలై నెలలో 48శాతంగా గెలుపు అవకాశాలు ట్రంప్‌కు ఉండగా... సెప్టెంబర్ చివరికి 57శాతానికి ఎగబాకింది. ఇదిలా ఉంటే పోలింగ్ డేటా ఫైవ్ థర్టీ ఎయిట్ మాత్రం మరోలా జోస్యం చెప్పింది. ఈ సంస్థ ప్రకారం కమలా హారిస్ స్వల్ప తేడాతో అధికారం చేపట్టే అవకాశాలున్నాయని పేర్కొంది. కమలా హారిస్ విన్నింగ్ ఛాన్సెస్ 48-49శాతం ఉండగా... ట్రంప్‌కు 46-47శాతంగా ఉన్నట్లు పేర్కొన్నాయి. అయితే ఏడు రాష్ట్రాల్లోనే అసలు సిసలైన పోరు కనిపిస్తోంది. ఇక్కడే ట్రంప్ కాస్త ముందంజలో ఉండే అవకాశం ఉంది. ఇక ట్రంప్ గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉండటంతో ఆయన వ్యాపారాలకు సంబంధించిన స్టాక్స్ ఒక్కసారిగా రయ్ మని దూసుకెళుతున్నాయి. ముఖ్యంగా ట్రంప్ మీడియా అండ్ టెక్నాలజీ గ్రూప్‌లకు చెందిన షేర్లు అక్టోబర్‌లో 86శాతం మేరా పెరిగాయి. ట్రంప్ గెలుస్తాడన్న ధీమా ఉండటంతోనే స్టాక్స్ రేట్ పెరుగుతోందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు ఇన్వెస్టర్లు. ట్రంప్ అధికారంలోకి వస్తారన్న వార్తలు ప్రచారంలో ఉండటంతో బ్యాంకింగ్, క్రిప్టో కరెన్సీ షేర్లు కూడా మార్కెట్‌లో చక్కటి ప్రదర్శన కనబరుస్తున్నాయి.

## సెక్యూరిటీ లేకుండా మూసీ ప్రాంతంలో తిరిగి చూపించు..


### సీఎం రేవంత్‌కు మాజీమంత్రి సవాల్



**హైదరాబాద్, :** రేవంత్ వ్యాఖ్యలు సీఎం స్థాయిని దిగజార్చేలా ఉన్నాయని మాజీమంత్రి జగదీష్ రెడ్డి అన్నారు. మూసీ సుందరీకరణ పై సీఎం రేవంత్ వ్యాఖ్యలు, రాష్ట్ర అప్పులు, గ్రూప్-1 అంశంపై ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజల పరువు పోయేలా రేవంత్ ఉపన్యాసాలు ఉన్నాయన్నారు. రేవంత్ వ్యక్తిగా పరువు పోగొట్టుకుంటే ఫర్వాలేదు.. తెలంగాణ సీఎంగా పరువు పోతే ఎవరికి నష్టం అని ప్రశ్నించారు. ఎవరో రాసిచ్చిన పాఠం చదవడం రేవంత్ మానేస్తే మంచిది.. సీఎం వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయన్నారు. తెలంగాణా ఆదాయం పెంచింది కేసీఆర్ అని అన్నారు. 2014 బడ్జెట్.. ఇప్పటి బడ్జెట్ చూస్తే ఎవరు ఆదాయం పెంచారో తెలుస్తుందన్నారు. అప్పులు మంత్రుల జేబులో నుండి కడుతున్నట్లు అతితెలివిగా మాట్లాడుతున్నారన్నారు. మేము కూడబెట్టిన ఆదాయం నిలబడితే చాలు అన్నారు. 420 హామీలొద్దు, కనీసం కేసీఆర్ ఇచ్చిన పథకాలైనా ఇస్తే చాలని ప్రజలు కోరుతున్నారు. రాష్ట్ర ఆదాయం, అప్పుల పై చర్చకు సిద్ధమేనన్నారు. సెక్యూరిటీ లేకుండా సీఎం రేవంత్ రెడ్డి మూసీ ప్రాంతంలో తిరిగి చూపించాలని సవాల్ విసిరారు. మూసీ కూల్చివేతల తరువాత సెక్యూరిటీ పెంచుకుని ప్రగల్భాలు పలుకుతున్నారని అన్నారు. ఆశోక్ నగర్ నిరుద్యోగుల వల్లే రేవంత్ కి అధికారం వచ్చిందన్నారు. ఇప్పుడు అశోక్ నగర్ పేరు వింటే రేవంత్ కి భయమేస్తోందన్నారు. అశోక్ నగర్ లో పోలీస్ నిర్బంధం దేనికి అని ప్రశ్నించారు. యువత ఆవేశం ఇలానే కొనసాగితే తెలంగాణ మొత్తం అశోక్ నగర్లే అవుతాయన్నారు. నిర్బంధం పెట్టె బదులు అనుమానాలు నివృత్తి చేయండన్నారు. కాంగ్రెస్ సీనియర్లే సీఎం ఏకపక్షంగా వెళున్నారని అంటున్నారు. ఇప్పటికే ప్రజల నుండి దూరమౌతున్న రేవంత్.. దూకుడు మానకపోతే పార్టీకి దూరమౌతావ్ అని హెచ్చరించారు.

## సేవింగ్స్ అకౌంట్స్‌లో నగదుకు లిమిట్..

## లేకుంటే ఐటీ నోటీసులు తప్పదు



**న్యూఢిల్లీ,:** ఇటీవల కాలంలో పరిస్థితులన్నీ పూర్తిగా మారిపోయాయి. ప్రతి ఒక్కరికి ఆధార్ కార్డు, పాన్ కార్డ్, బ్యాంక్ అకౌంట్ కంపల్సరీ అయిపోయింది. బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేయాలంటే.. ఖాతాదారుడికి ఖచ్చితంగా ఆధార్, పాన్ కార్డు ఉండి తీరాలి. అలా అయితేనే బ్యాంక్‌లో ఖాతా తెరుస్తున్నారు. అయితే బ్యాంక్ ఖాతాల్లో వివిధ రకాలు ఉన్నాయి. సేవింగ్ అకౌంట్, కరెంట్ అకౌంట్, శాలరీ అకౌంట్ తదితర రకాలున్నాయి. కానీ చాలా మంది సేవింగ్ అకౌంట్‌లనే ఓపెన్ చేస్తారు. అత్యధిక శాతం ఖాతాదారులు.. తాము సంపాదించిన నగదును ఈ ఖాతాల్లోనే పొదుపు చేస్తుంటారు. ఈ సేవింగ్ అకౌంట్లలో నగదు భద్రపరచడమే కాకుండా.. దీనిపై వడ్డీని సైతం పొందవచ్చు. మరికొన్ని సమయాల్లో.. ఇతరుల నగదును తమ ఖాతాల ద్వారా ఖాతాదారుడు లావాదేవీలు జరుపుతుంటాడు. అలాంటి వేళ సేవింగ్ అకౌంట్ పరిమితి దాటుతుంది. అసలు సేవింగ్ అకౌంట్‌లో లిమిట్ ఎంత ఉండాలి. ఈ అకౌంట్‌లో ఎంత నగదు జమ చేసుకోవచ్చు. ఓ వేళ ఆ పరిమితి దాటితే ఖాతాదారుడికి ఏమైనా ఇబ్బందులు ఎదురవుతాయా? అంటే.. ఎదురయ్యే అవకాశాలున్నాయి. సేవింగ్ అకౌంట్లలో దాచుకునే సొమ్ము పరిమితి దాటితే మాత్రం ఖాతాదారుడికి ఆదాయపు పన్ను శాఖ నుంచి నోటీసులు వచ్చే అవకాశముంది. మరి అలా కాకూడదంటే.. సేవింగ్ అకౌంట్‌లో ఎంత నగదు ఉంచవచ్చు. అంటే.. సేవింగ్ అకౌంట్‌లో ఎంత నగదు అయినా జమ చేసుకోవచ్చు. అందుకు పరిమితి లేదు. కానీ ఆదాయపు పన్ను శాఖ.. ఒక ఆర్థిక సంవత్సరంలో సేవింగ్స్ అకౌంట్‌లో నగదు జమ చేసేందుకు రూ.10 లక్షల వరకు పరిమితి విధించింది. అంటే ఒక ఏడాదిలో బ్యాంక్ సేవింగ్ అకౌంట్‌లో రూ.10 లక్షల వరకు నగదు జమ చేయవచ్చు. ఆపై నగదు జమ చేస్తే మాత్రం ఆదాయపు పన్ను పరిధిలోకి వచ్చేస్తారు. దాంతో జమ అయిన నగదుపై పన్ను చెల్లించవలసి ఉంటుంది. సేవింగ్స్ అకౌంట్స్‌లో నగదు పరిమితికి మించి జమ అయితే మాత్రం బ్యాంకులు.. ఆదాయపు పన్ను శాఖ దృష్టికి తీసుకు వెళ్తాయి. దీంతో ఆదాయపు పన్ను చట్టం 1961లోని సెక్షన్ 285 బీఏ నిబంధనల ప్రకారం.. మీ ఖాతాలో జమ అయిన నగదు వివరాలను ఆ శాఖ పరిశీలిస్తుంది. దీంతో సేవింగ్ అకౌంట్‌లో జమ అయిన నగదుకు.. రిటర్న్ ఫైల్ చేసే సమయంలో చూపిన వివరాలు కచ్చితంగా ఉండాలి. ఏ మాత్రం పొంతన లేకుంటే మాత్రం ఆదాయపు పన్ను శాఖ నోటీసులు జారీ చేస్తుంది. దీంతో ఖాతాదారుడు.. ఆ నగదుకు సంబంధించిన కచ్చితమైన వివరాలు ఆదాయపు పన్ను శాఖ వారికి సమర్పించాల్సి ఉంటుంది. ఆ క్రమంలో నగదు రాబడి అంశంలో ఏ మాత్రం తప్పు జరిగినట్లు భావించినా.. ఆదాయపు పన్ను శాఖ కఠిన నిర్ణయం తీసుకునే అవకాశముంటుంది. దీంతో జరిమానాతోపాటు చట్టపరమైన చర్యలకు సైతం ఆ శాఖ ఉపక్రమించే అవకాశముంది. ఈ నేపథ్యంలోల సేవింగ్స్ అకౌంట్‌లో నగదు ఎంత ఉండాలనే విషయాన్ని ఖాతాదారుడు ముందే తెలుసుకుని మసులుకుంటే మంచిది.

# మానవతా ధార్మికుడు రతన్ టాటా



రతన్ టాటా మరణం యావత్ దేశాన్ని శోకసంద్రంలో ముంచేసింది. ఎంతోమంది తమ కుటుంబ సభ్యుణ్ణి కోల్పోయినట్టు బాధపడి, ప్రతి ఒక్కరూ సోషల్ మీడియా వేదికగా తమ దుఃఖాన్ని వెలిబుచ్చారు. సాధారణ వ్యక్తులు సైతం టాటా సన్స్ గ్రూప్ గురించి తెలుసుకుని మరీ బాధపడటం టాటాలపై ఉన్న ప్రేమాభిమానాలకు నిదర్శనం. వ్యాపారాలు అందరూ చేస్తారు కానీ విలువలతో కూడిన వ్యాపారాలు చేస్తూ, సంపదను రోజురోజుకు పెంచుకోవడం ఒక ఎత్తు అయితే, వచ్చిన లాభాల్లో మళ్ళీ సమాజానికే సింహభాగం కేటాయించడం, నైతికత, విలువలతో వ్యాపారం చేయటం టాటా గ్రూప్ ప్రత్యేకత. ఇదే టాటాను ప్రపంచంలో ప్రత్యేకంగా నిలబెట్టింది.

ఇదొక్కటే కాదు సామాజిక అవసరాలు తీరుస్తూనే కాలానుగుణంగా వస్తున్న మార్పులతో పోటీపడి సామాన్య భారతీయుని కలలను సాకారం చేసేందుకు రతన్ టాటా తాపత్రయపడ్డారు. గుజరాత్‌లోని నవ్సారలో ఒక చిన్న బట్టల మిల్లుతో ప్రారంభమైన టాటాల ప్రస్థానం, నేడు ప్రపంచంలో వందకు పైగా దేశాల్లో అన్ని రంగాల్లో తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించి ప్రపంచమే అబ్బురపడేలా సాగుతోంది. గుజరాత్‌లో నూలు పరిశ్రమతో జంషెడ్‌జి టాటా గ్రూప్‌ను 1870లలో స్థాపించారు. ఆ తర్వాత ఈ గ్రూప్ ప్రస్థానం మనకు తెలియంది కాదు. ఒక్క టాటానే కాదు పార్శీలు అందరూ కష్టపడి పని చేయటంలోనూ, కాలానుగుణంగా మారడంలోనూ, వ్యాపార మెలకువల్లోనూ ప్రపంచంలోనే అగ్రగణ్యులు. ప్రస్తుతం మన దేశంలోని 145 కోట్ల మంది జనాభాలో పార్శీల జనాభా కేవలం 60 వేలు మాత్రమే. కానీ అనాదిగా దేశం కోసం విప్లవాత్మక మార్పులు తేవటంలో వారి పాత్ర అమోఘం. దేశంలో మొదటి బట్టల మిల్లు, మొదటి న్యూస్ పేపర్, మొదటి భారతీయ బ్యాంక్ స్థాపన పార్శీలే చేశారు. ముంబైలో సింహభాగం వ్యాపారాలే కాకుండా, ముంబైని ఆర్థిక రాజధానిగా మలిచింది కూడా పార్శీలే. కేవలం ఆర్థికంగానే కాక సాంఘిక రాజకీయ జీవనంలో కూడా వారి భాగస్వామ్యం వెలకట్టలేనిది. స్వాతంత్రోద్యమ కాలంలో కూడా ఫిరోజ్ షా మెహతా, దాదాబాయి నౌరోజీ లాంటి వారు, ప్రఖ్యాత సైంటిస్టు హోమి జహంగీర్ బాబా, పల్లోంజి మిస్త్రీ, గోద్రెజ్, పునావాల, వాడియాల కుటుంబాలు పార్శీలవే. ఇక జంషెడ్‌జి టాటా అయితే స్వామి వివేకానందతో చికాగో నుంచి చేసిన ప్రయాణమే తన వ్యాపార సామ్రాజ్యాన్ని మలుపు తిప్పిన ఇనుము ఉక్కు పరిశ్రమల స్థాపనకు ప్రేరేపించిందని చెప్పారు. స్వాతంత్ర్యం తరువాత జరిగిన అభివృద్ధిలో రతన్ టాటా నవభారత నిర్మాణానికి పునాదులు వేశారనడంలో సందేహం లేదు. ఆధునిక శాస్త్ర సాంకేతిక అభివృద్ధికి అనుగుణంగా రోజురోజుకీ వస్తున్న మార్పులను టాటా గ్రూప్‌కు అన్వయిస్తూ ప్రపంచంలోని మేటి సంస్థలకు దీటుగా నిలుపుతూనే సగటు భారతీయుని ఆలోచనలను, ఆకాంక్షలను తీర్చేందుకు నిత్య శ్రామికుడిగా మారాడు. ఎంతలా అంటే తాను వివాహం చేసుకుంటే మళ్ళీ వ్యాపారానికి ఇచ్చే సమయం ఉండదేమో అన్నంతగా. రతన్ టాటా చూపిన దాతృత్వ మార్గం మాత్రం కార్పొరేట్ వ్యాపార సామ్రాజ్యంలో ప్రకంపనలు సృష్టించింది. కార్పొరేట్ సామాజిక బాధ్యతలలో భాగంగా పేదల కోసం ఎన్నో వినూత్న సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారాయన. కంపెనీ లాభాల్లో రెండు శాతమో, ఐదు శాతమో లాభాలను టర్నోవర్‌ను బట్టి వినియోగించాలని సీఎస్ఆర్ చట్టం రూపొందించినా, రతన్ టాటా మాత్రం ఏకంగా 50 నుంచి 60శాతం లాభాలను సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగించటం నిజంగా ఆదర్శనీయం. విపత్తుల వేళ ఆయన చూపిన మానవతావాదం కార్పొరేట్‌లను విస్మయానికి గురిచేసింది. కరోనాకాలంలో పీఎమ్ కేర్స్‌కు ఏకంగా 1200 కోట్ల రూపాయలు విరాళంగా ఇవ్వడం, ఆయన చేతులకు ఎముకలు లేవని మరోమారు నిరూపిం చింది. దేశంలోని ప్రతి పౌరునికి టాటా గ్రూప్‌పై అభిమానం ప్రేమ కలిగేందుకు కారణం ఆయన చేసిన సామాజిక సేవా కార్యక్రమాలు. కార్పొరేట్ ఉద్యోగులకు, కంపెనీలకు సామాజిక స్పృహ ఉండాలని టాటా అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ స్థాపించడం చూస్తే సేవా గుణాన్ని, దాతృత్వాన్ని వ్యవస్థీకృతం చేసేందుకు ఆయన పడ్డ తాపత్రయం అర్థమవుతుంది. గుండు పిన్ను నుంచి విమానాల వరకు ఆయన స్పృశించని రంగం అంటూ ఏదీ లేదు. వారసత్వ కట్టడాలను పరిరక్షించడం కోసం తాజ్ హోటల్స్ పేరుతో లాభాపేక్ష లేకుండా అందరూ సందర్శించేలా చేశారు. కార్పొరేట్ వ్యాపారాలకు మానవతా విలువలు జోడించి, విజయం సాధించిన ఆధునిక వ్యాపారవేత్త ఆయన. భవిష్యత్తు భారతాన్ని అంచనా వేసి వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించారు. వేగంగా నడవాలంటే ఒంటరిగా, దూరం నడవాలంటే తోడుగా నడవాలన్న ఆయన మాటలు దూరదృష్టితో టాటాల సామ్రాజ్యం, దేశ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని చెప్పింది కావచ్చు. సామాన్య భారతీయుని కలల కారు ప్రయాణాన్ని లక్ష రూపాయలతో నానో కారు ద్వారా తీర్చి ఆయన సంచలనమే సృష్టించారు. నానో ద్వారా నష్టాలు వచ్చినా కష్టంగా భరించారు. ఇతర వ్యాపారాల్లో లాభాల ద్వారా ఈ నష్టాన్ని పూడ్చారే తప్ప సామాన్యుని కలలను మాత్రం చెరిపి వేయలేదు. ఆయన ఆచరించి చూపిన వ్యాపార మార్గం వ్యాపార నిర్వహణ శాస్త్ర విద్యార్థులకు, నిర్వాహకులకు పాఠాలుగా మిగిలిపోతాయి. దురదృష్టవశాత్తూ కమ్యూనిస్టు పార్టీలు అధికార పార్టీలను విమర్శించే క్రమంలో టాటాలకు, బిర్లాలకు దోచిపెడుతున్నారంటూ ఊతపదంగా వాడేవారు. టాటాలు ఎప్పుడు కూడా రాజకీయాలకు, వివాదాలకు దూరంగా ఉన్నారు. టాటా అంటేనే ట్రస్ట్, వ్యాపారం అంటే కేవలం ఆదాయం మాత్రమే కాదు అభిమానం, ఆత్మీయత అని నిరూపించారు రతన్ టాటా. భారతీయుల గుండెల్లో చెరగని ముద్ర వేసిన మనసున్న వ్యాపారవేత్త. దేశం సంకట స్థితిలో ఉన్నప్పుడు ఆపన్న హస్తాన్ని అందించే నిర్మల దేశభక్తుడు. ఆదాయం కంటే ఆత్మసంతృప్తి ముఖ్యమని కోట్లాదిమంది భారతీయుల హృదయాలను దోచుకుని చాలా లాభాన్ని సంపాదించి మూటగట్టుకెళ్లిన నిజమైన భారతరత్నం.

# కమ్ముతున్న వాయు కాలుష్యం

శీతాకాలం సమీపిస్తుండటంతో ఢిల్లీ, హర్యానా, పంజాబ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు మళ్లీ వాయు కాలుష్యానికి స్వాగతం ఇస్తున్నాయి. గత నెల ప్రధాని కార్యాలయం ఈ రాష్ట్రాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించింది. ఢిల్లీలో వాయు నాణ్యత క్షీణించకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించింది. వాహనాల కాలుష్యంతోపాటు, రోడ్లు, నిర్మాణాల దుమ్ముధూళి, ఘనవ్యర్థాల నిర్వహణ ఇవన్నీ గత కొన్నేళ్లుగా వాయు కాలుష్యానికి దారి తీస్తున్నాయని చర్చించారు. పంజాబ్, హర్యానాల్లో పంట వ్యర్థాలను మండించడం పెద్ద సమస్యగా తయారైంది. అక్టోబర్, నవంబర్ నెలలో కాలుష్యంలో 40% ఈ పంట వ్యర్థాలే కారణమవుతున్నాయి. ఈ ఏడాది పంజాబ్‌లో 19.52 మిలియన్ టన్నులు, హర్యానాలో 8 మిలియన్ టన్నుల వరి వ్యర్థాలను దగ్ధం చేస్తారని అంచనా. అయితే ఈ రెండు రాష్ట్రాలూ ఈ ఏడాది పంట వ్యర్థాలను దగ్ధం చేయకుండా నివారిస్తామని హామీ ఇచ్చాయి. గత ఏడాది నవంబర్‌లో సుప్రీం కోర్టు ఈ పంట వ్యర్థాల కాలుష్యంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పంట వ్యర్థాలను దగ్ధం చేయకుండా పూర్తిగా నిలువరించాలని ఆదేశించింది. ఈ ఏడాది రాష్ట్రాల సంగతి ఎలా ఉన్నా కేంద్రం తప్పనిసరిగా చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ వస్తోంది. 2023 పంటకోతల సీజన్‌లో పంజాబ్‌లో పంట వ్యర్థాల దగ్ధం సంఘటనలు 2022 తో పోలిస్తే 59% తగ్గాయి. అలాగే హర్యానాలో 2023లో 40% తగ్గాయి. కానీ ఉత్తరప్రదేశ్‌లో మాత్రం పంటవ్యర్థాల దగ్ధం సంఘటనలు 30% పెరగడం గమనార్హం. ఈ సమస్య నివారణకు ఆర్థిక రాయితీలు కల్పించడం, ఇతర చర్యలు తీసుకోవడం తప్పనిసరి. పంట వ్యర్థాలను 11.5 మిలియన్ టన్నుల వరకు దగ్ధం చేయకుండా పొలాల్లోనే వాటిని వినియోగించడం, మిగతా వ్యర్థాలను బయటకు తరలించడం చేస్తామని పంజాబ్ పేర్కొంది. దీంతో పాటు 2 మిలియన్ టన్నుల వరిగడ్డి వ్యర్థాలను ఎన్‌సిఆర్ రీజియన్‌లోని థర్మల్ పవర్ ప్లాంట్లలో మండించడానికి వినియోగిస్తున్నారు. అంటే వరిగడ్డి వ్యర్థాలను గుళికలుగా తయారు చేసి కార్బన్ వనరుగా వినియోగిస్తుంటారు. అయితే దీనికి కావలసిన యంత్రాలు రైతులకు అందుబాటులో లేవు. విద్యుత్ ప్లాంట్లలో పంట వ్యర్థాలను వినియోగించడం ఒక పరిష్కార మార్గమే అయినప్పటికీ, పొలం నుంచి పవర్‌ప్లాంట్‌కు ఈ వరిగడ్డి గుళికలను రవాణా చేసే వ్యవస్థ లేదు. పంటలకు కనీస మద్దతు ధర నిర్ణయించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కచ్చితమైన విధానాలు పాటించకపోవడం రైతులకు నష్టాలకు దారితీస్తోంది. సీజన్‌లో రెండు పంటలు వేస్తేనే కానీ తమకు నష్టాలు తీరవన్న ఉద్దేశంతో రైతులు వరిగడ్డిని దగ్ధం చేసి గోధుమ పంట సాగుకు సమాయత్తం అవుతుంటారు. అదే పంట వ్యర్థాల దగ్ధానికి దోహదమవుతోంది.



వరికి బదులుగా పెసర వంటి పప్పు ధాన్యాల సాగును చేపట్టినా గిట్టుబాటు ధర లభించడం లేదు. అందువల్ల చేసేది లేక వరిని సాగు చేయవలసి వస్తోందని రైతులు చెబుతున్నారు. వరిగడ్డి దగ్ధం వల్ల ఉత్పన్నమయ్యే కాలుష్యాల నివారణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ రాజకీయాలను పక్కనపెట్టి సమష్టిగా కృషి చేస్తేనే కానీ సత్ఫలితాలు రావు. ఢిల్లీలో గత ఏడాది రికార్డు స్థాయిలో వాయు నాణ్యతా ప్రమాణాలు పడిపోయాయి. మళ్లీ గత కొన్ని రోజులుగా వాయు నాణ్యత క్షీణిస్తోంది. గత మూడు నెలల్లో మొదటిసారి ఎక్యుఐ (వాయు నాణ్యత ప్రమాణాలు) 200 నుంచి 300 మధ్యకు చేరుకుంది. ఐక్యుఎయిర్ 2023 నివేదిక ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక కాలుష్య దేశాల్లో మన దేశం మూడో స్థానంలో ఉంది. దేశంలో సగటున క్యూబిక్ సెంటీమీటర్‌కు ఎయిర్‌బోర్న్ పర్టిక్యులర్ మేటర్ (ఎం.పి) 2.5 మైక్రోగ్రామ్స్ గాను, గాఢత 54.4 మైక్రోగ్రామ్స్ గాను కొనసాగుతోంది. గాలిలో కాలుష్యానికి కారణమయ్యే వివిధ రకాల వాయువులు, రసాయనాల మిశ్రమాన్ని ఎంపిగా పేర్కొంటారు. వాయు కాలుష్యం కారణంగానే మన దేశంలో సగటున సంవత్సరానికి రూ. 2.7 లక్షల కోట్ల ఆర్థిక నష్టం వాటిల్లుతోందని నివేదికలు చెబుతున్నాయి. స్థూల జాతీయోత్పత్తిలో ఇది 1.36 శాతం. వాహనాల నుంచి పరిశ్రమల నుంచి వెలువడే కర్బన ఉద్గారాలు, రసాయన వాయువులు, పరిశ్రమల నుంచి వెలువడే సల్ఫర్‌డైయాక్సైడ్, కార్బన్ డైయాక్సైడ్ కాలుష్యాలతో వాతావరణం పూర్తిగా కలుషితమవుతోంది. పంట వ్యర్థాలను దగ్ధం చేయడంతో శీతాకాలంలో ప్రజలకు శ్వాసకోశ సమస్యలు, గుండెజబ్బులు, అకాల మరణాలు సంభవిస్తున్నాయి. నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్‌సిఎపి) ప్రస్తుతం వాయు నాణ్యత పిఎంను 2.5 కంటే తగ్గించాలని లక్షంగా పెట్టుకుంది. ఈ లక్షంలో కనీసం 20నుంచి 40 శాతం వరకైనా 2026 నాటికి సాధించవలసి ఉంది. ఈ మేరకు లక్షాలను సాధించకపోతే ఢిల్లీలో ఎవరూ నివసించలేని దుర్భర పరిస్థితి దాపురిస్తుంది.

# అలవిమాలిన అలసత్వం



ఒకసారి జరిగితే పొరబాటు. అదే పొరబాటు రెండోసారి జరిగితే దాన్ని నిర్లక్ష్యం అనక ఇంకేమంటారు? ప్రపంచంలోనే అతి పెద్ద వ్యవస్థగా రికార్డులకు ఎక్కిన భారతీయ రైల్వే శాఖ ఒకదాని వెనుక ఒకటిగా చేస్తున్న తప్పిదాలు ప్రయాణికుల పాలిట ప్రాణాంతకంగా పరిణమిస్తున్నాయి. చెన్నై సమీపంలోని కవరైప్పెట్టై రైల్వేస్టేషన్ సమీపంలో మైసూరు- దర్భంగా భాగమతి ఎక్స్‌ప్రెస్ ప్రమాదానికి గురైన తీరును గమనిస్తే, రైల్వే శాఖ నిర్లక్ష్యం పతాకస్థాయికి చేరిందని అనిపించక మానదు. ఎక్స్‌ప్రెస్ రైలుకు గ్రీన్ సిగ్నల్ ఉన్నప్పటికీ లూప్ లైనులోకి వెళ్లి, అక్కడ ఆగి ఉన్న గూడ్సు రైలును వెనుకనుంచి ఢీకొట్టిందన్నది రైల్వే ఉన్నతాధికారుల కథనం. ఈ ప్రమాదంలో 12 కోచ్‌లు పట్టాలు తప్పగా రెండింటికి నిప్పంటుకుంది. ఈ ఘటనలో ప్రాణనష్టం జరగకపోవడం సంతోషించదగిన విషయం. పండగ పూట జరిగిన ఈ ప్రమాదం కారణంగా వేలాది ప్రయాణికులు సకాలంలో గమ్యస్థానాలకు చేరుకోలేక నానా అవస్థలూ పడ్డారు. అది అలా ఉంచితే, గత ఏడాది జూన్ నెలలో ఒడిశాలోని బాలసోర్ జిల్లా బాహానగా రైల్వే స్టేషన్ సమీపంలో సరిగ్గా ఇదే విధంగా ప్రమాదం జరిగింది. సిగ్నల్ ఉన్నప్పటికీ కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ రైలు మెయిన్ ట్రాక్ నుంచి లూప్ లైన్‌లోకి మళ్లి, అక్కడ నిలిచిఉన్న గూడ్సు రైలును వెనుకనుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో కొన్ని బోగీలు పక్కనున్న ట్రాక్ మీద పడటంతో, అదే సమయంలో అటుగా వెళ్తున్న యశ్వంత్‌పూర్-హౌరా ఎక్స్‌ప్రెస్ కూడా ప్రమాదానికి గురైం ది. ఈ దుర్ఘటనలో 290 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ శతాబ్దంలో జరిగిన అతి ఘోర ప్రమాదాలలో ఒకటిగా పరిగణిస్తున్న ఒడిశా రైలు ప్రమాదం నుంచి రైల్వే శాఖ పాఠాలు ఏమీ నేర్చుకోలేదనడానికి కవరైప్పెట్టై ప్రమాదమే తాజా ఉదాహరణ. భారతీయ రైల్వే వ్యవస్థ రానురాను పేరు గొప్ప ఊరు దిబ్బ చందంగా మారుతోందనడానికి ఉదాహరణలు కోకొల్లలు. ప్రతి రోజూ రెండున్నర కోట్లమంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేసే భారతీయ రైళ్లలో ప్రయాణికులకే కాదు, వాటిని నడిపే లోకో పైలట్లకు సైతం కనీస సౌకర్యాలు మృగ్యమవుతున్నాయి. పని గంటల భారం, రైల్వే రెస్ట్ రూముల్లో సౌకర్యాల లేమి వంటి సమస్యలు వారి పనితీరుపై ప్రభావం చూపిస్తున్నాయి. లోకో పైలట్లపైనే కాదు, ఇతర సిబ్బందిపైనా పని భారం పెరుగుతోంది. ఏళ్ల తరబడిగా పెండింగ్‌లో ఉన్న వేలాది పోస్టులను భర్తీ చేయకపోవడంతో సిబ్బందిపై పెనుభారం పడుతోంది. ఇక నాసిరకం సిగ్నలింగ్ వ్యవస్థ గురించి, అరకొరగా జరుగుతున్న ట్రాక్‌ల నిర్వహణ గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. బ్రిటిష్ కాలంనాటి రైలు పట్టాలను పునరుద్ధరించవలసిన అవసరం ఉన్నా, ఆ దిశగా చేపడుతున్న చర్యలు అంతంతమాత్రమే. వాస్తవానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని రైలు ప్రమాదాల నివారణకు రకరకాల అధునాతన పద్ధతులను రైల్వే శాఖ రూపొందించుకున్నా, వాటి అమలులోనే నిర్లక్ష్య వైఖరి ద్యోతకమవుతోంది. పొగమంచులో లోకో పైలట్లకు నావిగేట్ చేసేందుకు సహకరించే జిపిఎస్ ఆధారిత ఫాగ్ పాస్ పరికరం, లోపభూయిష్టమైన పట్టాలను గుర్తించేందుకు ఆల్ట్రాసోనిక్ ఫ్లా డిటెక్షన్ విధానం, పాయింట్లు, సిగ్నళ్లను నియంత్రించేందుకు ఇంటర్ లాకింగ్ సిస్టమ్ వంటివన్నీ రైల్వే శాఖ అభివృద్ధి చేసినవే. వీటన్నింటిలోనూ ముఖ్యమైనది 'కవచ్'. 2011 12లో అమలులోకి వచ్చిన ట్రెయిన్ కొలీజన్ అవాయిడెన్స్ సిస్టమ్‌నే ఇప్పుడు కవచ్‌గా వ్యవహరిస్తున్నారు. రెడ్ సిగ్నల్ పడినప్పుడు రైలు ముందుకు వెళ్లకుండా ఉండటం, కవచ్ వ్యవస్థ కలిగి ఉన్న రెండు రైళ్లు ఢీకొనకుండా నివారించడం, అత్యవసర పరిస్థితుల్లో ఎస్ఒఎస్ మెస్సేజులు పంపించడం వంటివన్నీ పొందుపరచిన కవచ్‌ను.. రైలు ప్రమాదాల నివారణకు కచ్చితత్వంతో పనిచేసే వ్యవస్థగా చెప్పుకోవచ్చు. కానీ, ఈ విధానాన్ని అమలు చేయడంలో రైల్వే శాఖ ఉదాసీన వైఖరే ప్రమాదాలు పెచ్చుమీరడానికి కారణమవుతోంది. మన దేశంలో రైలు మార్గాల పొడవు 68 వేల కిలోమీటర్లయితే, ఇప్పటివరకూ కవచ్ ఏర్పాటైన దూరం 1455 కిలోమీటర్లు మాత్రమే. మరో మూడువేల కిలోమీటర్ల రైలు మార్గంలో పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడు ఎక్స్‌గ్రేషియా ప్రకటించి చేతులు దులుపుకునే రైల్వే మంత్రిత్వశాఖ ఇప్పటికైనా కళ్లు తెరవాలి. సౌకర్యాల లేమితో, తరచూ చోటు చేసుకుంటున్న ప్రమాదాలతో రైల్వే శాఖపై ప్రయాణికులలో పెరుగుతున్న అపనమ్మకానికి అడ్డుకట్ట వేసే దిశగా చర్యలు చేపట్టడం ప్రభుత్వ తక్షణ కర్తవ్యం.